## ఢిల్లీలో కాస్త మెరుగుపడిన గాలి నాణ్యత..

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత సోమవారం కాస్త మెరుగుపడింది. అయినప్పటికీ వెరీ పూర్ కేటగిరీ లోనే ఉంది. ఢిల్లీలో ఆదివారం ఏక్యూఐ లెవెల్స్ 377గా నమోదైన విషయం తెలిసిందే. ఇవాళ 319కి తగ్గింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. సోమవారం ఉదయం ఢిల్లీలో ఓవరాల్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 319గా నమోదైంది. అత్యధికంగా వజీర్‌పూర్‌లో 385, నరేలాలో 382గా ఏక్యూఐ నమోదైంది. ఇక రాజధానిలోని 39 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో చాలా వరకూ ఏక్యూఐ లెవెల్స్ వెరీ పూర్ కేటగిరీలోనే ఉంది. ద్వారకా ప్రాంతంలో 259, లోధి రోడ్డులో 210, ఢిల్లీ యూనివర్సిటీ ప్రాంతంలో 242, ఐజీఐ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 285తో ఏక్యూఐ పూర్ కేటగిరీలో ఉంది. ఇక ఐటీవో ప్రాంతంలో గాలి నాణ్యత సంతృప్తికరంగా నమోదైంది. అక్కడ ఏక్యూఐ 99గా ఉంది. నవంబర్ 4 వరకూ రాజధానిలో గాలి నాణ్యత చాలా పేలవమైన కేటగిరీలోనే ఉండే అవకాశం ఉందని ఎయిర్ క్వాలిటీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ తెలిపింది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :216 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 04-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## చేవెళ్ల లో బస్సును ఢీకొన్న టిప్పర్ లారీ 21 మంది మృతి



రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సును కంకర్ లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో 21 మంది దుర్మరణం చెందారు మరో 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్–బీజాపూర్ హైవేపై ప్రయాణిస్తున్న టిప్పర్ లారీ, 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు మృతి చెందగా.. 24 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో అయిదుగురు పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో చేవెళ్ల%–%వికారాబాద్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. టిప్పర్ లారీ కంకర తో సహా బస్సు మీద పడిపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. మృతుల్లో 10 నెలల చిన్నారి కూడా ఉండటం విషాదం రేపింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

బస్సు టిప్పర్ ప్రమాదంలో మృతులు 19మంది

మీర్జాగూడ బస్సు టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మరణించారని ప్రభుత్వం ప్రకటించింది. 20 మందికి గాయాలయ్యాయని.. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని.. చేవెళ్ల ఆసుపత్రిలో పదిమందికి చికిత్స కొనసాగుతుందని, మహేందర్ రెడ్డి ఆసుపత్రిలో మరో 10 మందికి చికిత్స అందిస్తున్నామని ప్రభుత్వం వెల్లడించింది. మృతుల్లో పది మంది మహిళలు, మూడు నెలల చిన్నారి కూడా ఉన్నారని తెలిపింది. మృతుల్లో ఇద్దరు డ్రైవర్లతోపాటు ఆరుగురు పురుషులు ఉన్నారని వెల్లడించింది. తాండూర్ నుంచి హైదరాబాద్ కు బయలుదేరిన బస్సు లో 72 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారు. మృతులంతా తాండూరు, చేవెళ్ల వాసులే. తాండూరు వడ్డెర గల్లీకి చెందిన ముగ్గురు అక్క చెల్లెలు మృతి చెందారు. మృతులు అనూష, సాయి, ప్రియ నందినిలుగా గుర్తించారు. ప్రమాదంలో 19 మంది మరణించారని, మరో 20 మంది కి తీవ్ర గాయాలయ్యాయని.. వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఏడు లక్షల చొప్పున పరిహారం, గాయపడిన వారికి రెండు లక్షల చొప్పున పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామని వెల్లడించారు. మీర్జాగూడలో ప్రమాదానికి గురైన బస్సును ఆర్టీసీ హైర్ వెహికల్ (అద్దె)గా గుర్తించారు. డ్రైవర్ పేరు దస్తగిరి బాబా అని పోలీసులు తెలిపారు. బస్సు నంబర్ TG 34TA 6534. సోమవారం తెల్లవారుజామున 4.40 గంటలకు బస్సు తాండూరు బస్టాండ్ నుంచి బయల్దేరి, 6.15 గంటలకు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కండక్టర్ రాధ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆమె ఎడమవైపున కూర్చోవడం వల్లే ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

## చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదం.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

చేవెళ్ల, నవంబర్ 3: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటనలో పోస్టుమార్టం ఒకే చోట నిర్వహించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. మృతదేహాలకు ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అధికారులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. తాండూర్ నుండి హైదరాబాద్‌కు బస్సు ఉదయం 5 గంటలకు బయలుదేరినట్లు అధికారులు గుర్తించారు. బస్సులో ప్రయాణించిన ప్రయాణికులు 30 మంది తాండూరుకు చెందిన ఉద్యోగులుగా వెల్లడించారు. అటు ఈ ప్రమాద ఘటనపై పోలీసుల విచారణ ప్రారంభించారు. ఈ కేసును లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసుపై రాజేంద్రనగర్ డీసీపీ నేతృత్వంలో విచారణ కొనసాగుతోంది. ఘటనా స్థలంలో ఇప్పటికే క్లూస్ టీం ఆధారాలను సేకరించింది గత ఏడాది డిసెంబర్‌లో కూడా మీర్జాగూడ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆలూరు వద్ద టిప్పర్ దూసుకెళ్లి ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. చేవెళ్ల బస్సు ప్రమాదంలో మృతి చెందిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రిలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు



ప్రమాదంలో 19 మంది మృతి చెందినట్లు అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ అధికారికంగా వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోందని చెప్పారు. అటు మృతుల బంధువులు ఆసుపత్రికి చేరుకుంటున్నారు. బంధువుల ఆర్తనాదాల మధ్య ఘటనాస్థలి వద్ద హృదయవిదారక దృశ్యాలు చోటుచేసుకున్నాయి. ఘటనా స్థలంలో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు ప్రమాద స్థలంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు.

## రేవంత్ సర్కార్‌పై హైడ్రా కుట్ర! జగ్గారెడ్డి సంచలన ఆరోపణలు..

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పెను దుమారం రేగింది. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారాయి. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పాటైన 'హైడ్రా' అధికారులు, బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

హైడ్రా చర్యల వెనుక రాజకీయ కుట్రనా?

జగ్గారెడ్డి తోపణల ప్రధాన సారాంశం ప్రకారం, కొంతమంది హైడ్రా అధికారులు ఉద్దేశపూర్వకంగా అతిగా వ్యవహరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కూల్చివేతలు, దాడులు వంటి చర్యలకు పాల్పడుతున్నారు. "ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో కొంతమంది హైడ్రా అధికారులు అత్యుత్సాహంగా వ్యవహరిస్తున్నారు. వీరి చర్యలు బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చేలా ఉన్నాయి," అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా చర్యల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కూల్చివేతలు, దాడులను బీఆర్ఎస్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ, కాంగ్రెస్‌పై ప్రతికూల ప్రచారాన్ని (నెగెటివ్ క్యాంపెయిన్) నడుపుతోందని జగ్గారెడ్డి ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యం

రాబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలోనే ఈ కుట్ర జరుగుతోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. "హైడ్రా దాడులను బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో భాగంగా ఉపయోగించుకుంటోంది. ఇప్పటి వరకు హైడ్రా గురించి మాట్లాడని కేటీఆర్ ఇప్పుడు ప్రతిరోజూ దాని పేరు ప్రస్తావించడం వెనుక పెద్ద కారణాలున్నాయి," అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

హైడ్రా చీఫ్ దృష్టి సారించాలి

ఈ వ్యవహారంపై హైడ్రా చీఫ్ రంగనాథ్‌ను ఉద్దేశిస్తూ జగ్గారెడ్డి కీలక డిమాండ్ చేశారు. "కొంతమంది అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.



వీరి వ్యవహారంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు

ఈ అంశాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. "బీఆర్ఎస్‌కు మద్దతుగా పనిచేస్తున్న అధికారుల కుట్రలకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. హైడ్రా చర్యల వల్ల నష్టపోయిన బాధితులను తాను స్వయంగా కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

చర్చనీయాంశంగా మారిన ప్రశ్నలు

జగ్గారెడ్డి చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలు తెలంగాణ రాజకీయాలను కొత్త మలుపు తిప్పాయి. హైడ్రా చర్యల వెనుక నిజంగానే బీఆర్ఎస్ అనుకూల కుట్ర ఉందా?లేక ఇది కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత అసంతృప్తికి ప్రతిబింబమా?జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఈ వివాదం ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా హైడ్రా చీఫ్ రంగనాథ్ విచారణ.. సీఎం రేవంత్ రెడ్డి చర్యలపై ఆధారపడి ఉంటుంది. ఈ వివాదం రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడిని పుట్టించడం ఖాయం.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు : హైడ్రా.. బీఆర్ఎస్‌కు ప్లస్.. కాంగ్రెస్‌కు మైనస్!



హైదరాబాద్, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. నవంబర్ 11న పోలింగ్ జరుగనుంది. సిట్టింగ్ స్థానం కాపాడుకోవాలని, హైదరాబాద్‌తో పట్టు సడలలేదని నిరూపించరోవాలని, అధికార కాంగ్రెస్ పాలనలో విఫలమైందని నిరూపించాలని బీఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇక అధికార కాంగ్రెస్ తమ పాలను బాగుందని, హైదరాబాద్‌లోనూ బలం పెరిగిందని, నిరూపించకోవాలని ప్రయత్నిస్తోంది. ఇక బీజేపీ కూడా పట్టుకోసం ప్రయత్నిస్తోంది. ఈ తరుణంలో హైడ్రా ఇప్పుడు బీఆర్ఎస్‌కు ప్రచారాస్త్రంగా మారింది. అధికార పార్టీకి ఇదే మైనస్‌గా మారింది. "హైడ్రా" పేరుతో జరుగుతున్న కూల్చివేతలు ఎన్నికల చర్చను పూర్తిగా మలుపు తిప్పాయి.

హైడ్రా ప్రచారాస్త్రం..

రేవంత్ ప్రభుత్వం చేపట్టిన హైడ్రా ఆపరేషన్ కింద అనధికార నిర్మాణాలపై కూల్చివేతలు జరుగుతున్నాయి. అయితే, ఈ చర్యలు పేదలు, మధ్యతరగతివారిని లక్ష్యంగా చేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ధనికుల నిర్మాణాలపై చూపు లేకుండా, సామాన్యుల ఇళ్లపైకి బుల్డోజర్ల పపండంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేటీఆర్ ప్రకారం, 15 మంది బిల్డర్ల నిర్మాణాల్లో తప్పులు ఉన్నాయని స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కా అంగీకరించినప్పటికీ చర్యలు లేవు.

కానీ అదే సమయంలో, సాధారణ పౌరుల ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వం తారతమ్యం పాటిస్తోందని చెప్పారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా చర్యలు లేవని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్మాణంపై కూడా చర్యలు లేకపోవడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోందని పేర్కొన్నారు.

ఒవైసీ నిర్మాణాల ప్రస్తావ..

కేటీఆర్ విమర్శల్లో మరో విభాగం మజ్లిస్ నేతలకూ సంబంధించినది. ఓల్డ్ సిటీలో ఒవైసీ కుటుంబానికి చెందిన కట్టడాలు చెరువుల్లో ఉన్నా అవి హైడ్రా పరిధికి రాలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్–ఎంఐఎం కలిసి పనిచేశాయి. ఇప్పుడు ఎంఐఎం నేతల ఆస్తులను కూల్చకపోవడం ఏంటని నిలదీస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌పై ప్రభావం..

హైడ్రా ఆపరేషన్ కొనసాగుతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం గందరగోళంలో పడిందని, పెట్టుబడిదారులు వెనుకడుగుపెడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రభుత్వం 64 రంగాలను దెబ్బతీస్తూ, బలవంతులను ఆదరిస్తూ, బలహీనులను అణచివేస్తోందని మండిపడ్డారు. ఈ సందేశాన్ని ఓటర్లకు చేరవేయడానికి బీఆర్ఎస్ నాయకులు సమావేశాల్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లతో ఉదాహరణలు చూపిస్తున్నారు. ఈ ఉప ఎన్నిక ఇప్పుడు కేవలం ఒక నియోజకవర్గ పోటీగా కాకుండా, హైడ్రాకు, ప్రభుత్వ పనితీరుకు రెఫరండంగా బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. బుల్డోజర్ రావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, ఆపాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కేటీఆర్ కోరుతున్నారు.

## బస్సు ప్రమాదంపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్

హైదరాబాద్, నవంబర్ 03: హైదరాబాద్– బీజాపూర్ నేషనల్ హైవే 163 మీర్జాగూడ వద్ద ఈ రోజు తెల్లవారుజామున జరిగిన కంకర టిప్పర్–బస్సు ప్రమాదం అందరిని కలిచివేసింది. ఈ ప్రమాదంపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ రోడ్డు మార్గంలో ఉన్న మర్రి చెట్ల కోసం మనుషుల ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిజాం కాలం నాటిదని, దీనిపై టంగాలు, పాత కార్లు తిరిగేందుకు నిర్మించారన్నారు. ఈ మార్గం పూర్తిగా వంకర్లు తిరిగి ఉంటుందని తెలిపారు. ఇంతకాలంగా దీన్నే విస్తరిస్తూ వస్తున్నారని, వికారాబాద్ ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇదొక్కటే హైవే మార్గమని చెప్పారు. తాను ఎంపీ గా ఉన్న సమయంలో దీన్ని విస్తరించాలని చేసిన ప్రయత్నంలో కేంద్ర మంత్రి దీన్ని మంజూరు చేశారన్నారు. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ విషయంలో చాలా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రోడ్డు విస్తరణ చేస్తే వందాలి ఏండ్లుగా ఉన్నా మర్రి చెట్లు పోతున్నాయని తమిళనాడుకు చెందిన పర్యావరణ ప్రేమికులు కోర్టులో కేసులు



వేశారని మండిపడ్డారు. కోర్టుకు వెళ్లినవారు ఎవరూ స్థానికులు కాదని, వీరికి మర్రి చెట్లమీద ఫికర్ ఉంది కానీ ప్రజల ప్రాణాల మీద మాత్రం లేదని విమర్శించారు. మర్రి చెట్లను రీప్లాంట్ చేస్తామని చెప్పినా వినలేదని, చివరకు తాజాగా కేసు విత్ డ్రా చేసుకోవడంతో పనులు ప్రారంభమయ్యాయన్నారు.

## న్యాయ వ్యవస్థపై జగన్ ఒత్తిడి.. మాజీ సీజేఐ సంచలన వ్యాఖ్యలు..!



అమరావతి,జడ్జీలు సాధారణంగా వివాదాదస్పద వ్యాఖ్యలు చేయరు. రిటైర్ అయిన తర్వాత కూడా తాము పదవిలో ఉన్నప్పుడు జరిగిన విషయాలను బహిర్గతం చేయరు.కానీ, కొంతకాలంగా న్యాయమూర్తులు కూడా ఓపెన్ అవుతు న్నారు. తాజాగా మాజీ సీజేఐ ఎన్వీ.రమణ కూడా తాను పదవిలోకి రాకము ందు.. వచ్చిన తర్వాత ఎదుర్కొన్న ఒత్తిడులను బయట పెట్టారు. తనపై జరిగిన రాజకీయ ఒత్తిడి, కేసులను వివరించడం న్యాయ వ్యవస్థలో చర్చనీయాంశమయ్యాయి.

న్యాయమూర్తులపై ప్రతీకార రాజకీయాలు..

అమరావతి రాజధాని ఉద్యమానికి న్యాయపరంగా అండగా నిలబడటం తనపై కుట్రలకు కారణమైందని రమణ వెల్లడించారు. వైసీపీ నేతలు తన కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులు పెట్టడం, ల్యాండ్ కొనుగోళ్లను నేరంగా చూపించడం వంటి చర్యలు రాజకీయ ప్రతీకారానికి నిదర్శనమని ఆయన తెలియజేశారు. ఆ కేసులు తుది దశలో కోర్టుల్లో రద్దు కావడం ఆ కుట్రల అసలు ఉద్దేశాన్ని బయటపెట్టిందన్నారు.

సీజేఐ రాకుండా కుట్ర..

ఇక 2020లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి న్యాయమూర్తి రమణపై అధికారిక ఫిర్యాదు చేశారు. ఆయన రాజకీయ ప్రభావం చూపుతున్నారని, హైకోర్టు తీర్పులను దారి మళ్లిస్తున్నారని ఆరోపణలు చేశారు. సీజేఐ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశార. సుప్రీం కోర్టు అంతర్గతంగా విచారణ జరిపి వాటిని ఆధారరహితంగా తేల్చింది. ఆ తర్వాత రమణ సీజేఐ హోదాలో బాధ్యతలు స్వీకరించడం న్యాయస్వరాజ్యానికి చిహ్నంగా భావించబడింది.

అమరావతికి కోర్టుల అండ..

అమరావతి ప్రాజెక్టు నిలవడానికి హైకోర్టు తీర్పులే కారణమయ్యాయని రమణ తెలిపారు. న్యాయస్థానం గట్టి పట్టు చూపించకపోతే, రాజధాని ప్రణాళిక సంపూర్ణంగా రద్దయి ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ విలువలను కాపాడిన న్యాయమూర్తులు బదిలీ కూడా అయ్యారని ప్రస్తావించారు. న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిడి ఎంత ప్రమాదకరమో రమణ గుర్తు చేశారు. న్యాయపరమైన స్వతంత్రతకు హాని చేసేదే దేశ పరిపాలనకూ బలహీనతగా మారుతుందనే సంకేతాలు ఇచ్చారు. న్యాయ అధికారులపై కేసులు వేయడం, బదిలీలతో ఒత్తిడి తేవడం వంటి చర్యలను రాజ్యాంగ విరుద్ధంగా అభివర్ణించారు. మాజీ సీజేఐ వ్యాఖ్యలతో వైసీపీ పాలన తరహా, ఆ కాలం రాజధాని విధానాలపై చర్చ మళ్లీ మొదలైంది. న్యాయరంగంలో రాజకీయ హస్తక్షేపం జరిగినట్లు మాజీ న్యాయమూర్తి బహిరంగంగా వ్యాఖ్యానించడం ఇది మొదటిసారి కావడం విశేషం.

## కబళించిన మృత్యువు.. బస్సు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి



రంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే . ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకు 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కొందరు తల్లిదండ్రులను కోల్పోగా.. మరికొందరు తమ పిల్లల్ని కోల్పోయారు. ఇక ఈ ఘటన ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. ఒకే తల్లికి పుట్టిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉండే ఎల్లయ్య గౌడ్‌కు ముగ్గురు కుమార్తెలు నందిని, సాయిప్రియ, తనూష ఉన్నారు. వారు హైదరాబాద్‌లో చదువుతున్నారు. ఇటీవలే బంధువులు పెళ్లి ఉండటంతో సొంతూరికి వచ్చారు. వేడుకలను ముగించుకొని నగరానికి పయనమయ్యారు. ముగ్గురూ ఇవాళ ఉదయం బస్సులో బయల్దేరారు. ఎంతో సంతోషంగా ఉన్న వారిని మృత్యువు కబళించింది. పెళ్లివేడుకలో సందడిగా గడిపిన అక్కాచెల్లెళ్లు ముగ్గురూ ఇవాళ విగత జీవులుగా మారారు. బస్సు ప్రమాదంలో స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో ముగ్గురు కుమార్తెలు మరణించడంతో తండ్రి ఎల్లయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## సంపాదకీయం

మంగళవారం 04-11-2025

# తుఫాన్ బాధితులను గాలికి వదిలేస్తే ఎలా?

చెరువులు, నాలాల కబ్జాకు గురవుతున్నాయని స్వయంగా ప్రకటిస్తున్న పాలకులు అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాకోరులను ప్రభుత్వాలే రక్షిస్తూ గడుసు మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాలు తలచుకుంటే కబ్జారాయుళ్లను తొలగించడం నిముషంలో పని. హైడ్రా చేస్తున్న పనిని అంతటా చేయించే బాధ్యత ఉందా లేదా అన్నది సిఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి. వరంగల్ జిల్లాలో వరదనష్టం సందర్భంగా కబ్జాలపై వ్యాఖ్యలు చేసిన సిఎం, అందుకు తగ్గట్లుగా ప్రణాళిక సిద్ధం చేసి చిత్తశుద్ధిని చాటాలి. ఉత్పాతాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా సాయం ప్రకటించడం, అందరినీ ఆదుకున్నామని చెప్పడంతో సరిపెట్టేస్తున్నారు. ఇల్లు మునిగిని వారికి 15 వేలు పరిహారంగా తెలంగాణ సిఎం ప్రకటించారు. ఈ డబ్బుతో ఏం వస్తుందో అధికారులు, సిఎం రేవంత్ రెడ్డి చెబితే బాగుండేది. దెబ్బతిన్న ఇళ్లను, రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించడం లేదు. ఆక్రమణలను తొలగించాలన్న దానికి కూడా ప్రణాళిక లేదు. అలాగే ఎపిలో తుఫాన్‌లో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు సర్టిఫికెట్లు ఇచ్చారు. అధికారులు పనిచేయడం వారి విధి. జీతాలు తీసుకుంటున్నారు. అయినా వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిందే. ఇదే సమయంలో గ్రామాల వారీగా నష్టపోయిన వారి లెక్కలు తీసుకుని ఆదుకుంటే బాగుంటుంది. ఎందుకంటే తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు సామాన్యుల జీవితాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. వీరిని ఆదుకోవాలి. ఆదుకునే వరకు మనమంతా సంఘటితంగా ముందుకు సాగాలి. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత ముఖ్యం. తుఫాన్ గండం గడిచింది కనుక గ్రామాల వారీగా తెలుగు రాష్ట్రాల్లో బాధితులను గుర్తించి వారిని ఆదుకోవాలి. పంటలను ఎంతమేరకు నష్టపోయారో లెక్కలు వేయాలి. ఎకరా పంటకు ఎంతపెట్టుబడి పెట్టారో గుర్తించాలి. అన్నదాతల విషయంలో అలసత్వం తగదు. తాజా మొంథా తుఫాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు తుఫాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని బోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేసి ఆదుకోవడంలో కేంద్రం ఉదారంగా ముందుకు రావాలి. పంటనష్టపోయిన రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాలి. గతంలో పెనుతుపానులు, వరదలు వచ్చినప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ముందుగానే అంచనా వేసినట్లుగానే మొంథా అల్లకల్లోలం సృష్టించింది. ప్రత్యేకించి కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలు ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్లు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం మంచి ఫలితాలు ఇచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. అయితే ఇదే వేళలో ఇప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవాలి. సామాన్యుల నుంచి రైతుల వరకు అనేకులు తీవ్రంగా నష్టపోయారు. వారిని గుర్తించి ఆదుకోవడం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

# హస్తానికి అజహర్ పాశుపతాస్త్రమేనా?

హైదరాబాద్,హత్యకు గురి కావడానికి సరిగ్గా మూడు రోజుల ముందు.. అంటే 1948 జనవరి 27వ తేదీన మహాత్మాగాంధీ ప్రస్తుతం ఉన్న స్వరూపంలో కాంగ్రెస్‌కు కాలం చెల్లిపోయింది అంటూ, దానిని రద్దుచేసి ఆ స్థానంలో 'లోక్ సేవక్ సంఘ్' పేరుతో జనంలోకి వెళ్లాలని చిన్న నోటు రాశారు. దురదృష్టవశాత్తూ ఆయన ఆ అభిప్రాయం వెలిబుచ్చిన మూడు రోజులకే హత్యకు గురి ఉండకపోతే పట్టుబట్టి కాంగ్రెస్‌ను రద్దు చేయించి ఉండేవారా? నిజంగానే అదే జరిగి ఉంటే భారతదేశ రాజకీయాలు ఎంత నిస్తేజంగా, చప్పగా ఉండేవో ఊహించడం కష్టమే కదా. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఒక గొప్ప లక్షణమే అది, ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయ్యి, కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సన్నిహితులు కొందరు వైయస్సార్ ఆత్మ అయిన కెవిపి రామచంద్రరావుకు రాజ్యసభ గ్యారెంటీ అని ఊహాగానాలు చేస్తుంటే, ఆయనను అభినందిస్తుంటే కెవిపి ఒక మాట అన్నారు.. కాంగ్రెస్‌తో గేమ్స్ ఆడొద్దు అని. ఖాన్ తో గేమ్స్ ఆడొద్దన్న ఒక సినిమా డైలాగ్‌ని గుర్తు చేస్తూ. ఆయన అన్నట్లుగానే అప్పుడు రాజ్యసభ సభ్యత్వం రాలేదు. కొద్దికాలం తర్వాత ఆయన రాజ్యసభకు వెళ్లారు.కాంగ్రెస్ ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరు చెప్పలేరు. అది ఊహాతీతమైన రాజకీయపక్షమని ఆయన ఉద్దేశం. ప్రస్తుతం తెలంగాణలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరుగుతున్న తరుణంలో కూడా కాంగ్రెస్ వ్యవహార శైలి కెవిపి అన్నట్టు కాంగ్రెస్ తో గేమ్స్ ఆడొద్దు అన్నట్టుగానే ఉంది. కొంతకాలంగా తెలంగాణలో రెండు శాసనమండలి పదవుల విషయంలో పలు పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రముఖ తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను, ఒక ఉర్దూ పత్రిక సంపాదకుడు ఆమెర్ అలిఖాన్‌ను శాసనమండలి సభ్యులుగా గవర్నర్ కోటాలో మంత్రి మండలి సిఫార్సు చేస్తే దానికి సుప్రీంకోర్టు అడ్డుపడటం, ఆ తర్వాత మళ్లీ మంత్రిమండలి కోదండరామ్ తోపాటు, ఆమేర్ అలీని తొలగించి, మహమ్మద్ అజరుద్దీన్‌ను ప్రతిపాదించి గవర్నర్‌కు పంపింది. ఇప్పటికింకా గవర్నర్ ఆ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈలోగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ముంచుకొచ్చి అక్కడ ఒకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా 2023లో పోటీ చేసి ఓడిపోయిన అజహరుద్దీన్‌ను మంత్రిగా నియమించింది. ఆయన శాసనమండలి సభ్యత్వం ఇంకా ఖరారు కావలసి ఉంది.అయితే ఏ చట్టసభలోనూ సభ్యుడు కాకపోయినా మంత్రివర్గంలో చేర్చుకునే పూర్తి అధికారం ముఖ్యమంత్రికి ఉంటుంది. కానీ ఆ పదవి చేపట్టిన ఆరు మాసాలలో శాసనసభ లేదా శాసనమండలి నుండి సభ్యుడిగా ఎన్నికయి రావలసి ఉంటుంది. అలా జరగకపోతే గతంలో ఎన్టీ రామారావు కుమారుడు నందమూరి హరికృష్ణ పరిస్థితి అజహర్‌కు ఎదురుకాకతప్పదు. 1995లో ఎన్టీ రామారావును అన్యాయంగా దింపేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న సమయంలో నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కుటుంబాన్ని తనవైపు తిప్పుకునే క్రమంలో హరికృష్ణను, ఏ చట్టసభలోనూ సభ్యుడు కాకపోయినా, మంత్రిగా నియమించి రవాణాశాఖ అప్పగించారు. ఆరుమాసాలు తిరగకుండానే ఎన్టీఆర్ మరణించడంతో ఇక తనకు హరికృష్ణ అవసరం లేదనుకున్నారేమో చంద్రబాబు ఆయనను చట్టసభకు పంపించే ఆలోచనకు సున్నాచుట్టారు. దాంతో హరికృష్ణ మంత్రిపదవి ఊడింది. అటువంటి పరిస్థితి అజహరుద్దీన్‌కు రాకూడదనుకుంటే ఆయన ఆరు మాసాల్లోపు తప్పనిసరిగా శాసనమండలి సభ్యుడు అయ్యేట్టు చూసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదే.ఆరు మాసాల్లో ఆయన శాసనసభకు వెళ్లే అవకాశం అయితే లేదు. ఆయనను శాసనసభకు పంపించే ఆలోచన కాంగ్రెస్‌కు ఉన్నట్టయితే గత ఎన్నికల్లో అదే నియోజకవర్గంనుంచి కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేశాడు కాబట్టి అజహర్‌కే ప్రస్తుత ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ స్థానంలో పార్టీ టికెట్ ఇచ్చి ఉండేది. వచ్చే ఆరు మాసాల్లో ఆయన మరే నియోజకవర్గంనుంచి శాసనసభకు పోటీ చేసే అవకాశం లేదు.ఇదిలాఉంటే కాంగ్రెస్ పార్టీలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కొంతకాలంగా చర్చ జరుగుతున్నది. ఆ పార్టీలో ప్రతి నాయకుడు తాను ఎందుకు మంత్రి కాకూడదు, ఎందుకు ముఖ్యమంత్రి కాకూడదు అన్న మితిమీరిన ఆత్మవిశ్వాసం కలిగి ఉన్నవారే కాబట్టి కాంగ్రెస్ పార్టీలో ఆశావహులకు ఎన్నడూ కొరతలేదు. అయితే ఈ వారంలో అజహరుద్దీన్ ఒక్కడితో మంత్రివర్గ విస్తరణ చేసి, అదే రోజు మరో ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ నాయకులకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఒకరిని సలహాదారుగా, మరొకరిని కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడాన్ని చూస్తే త్వరలో మంత్రివర్గ విస్తరణ ఖాయమని అర్థమవుతున్నది. ఇందులో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు బాధ్యత చూసుకునే సలహాదారు పదవికి అత్యంత సీనియర్ నాయకుడు, నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శనరెడ్డికి కేబినెట్ సమావేశాలకు కూడా హాజరయ్యే వీలు కల్పించడం విశేషం.ఇద్దరికీ కేబినెట్ హోదా కల్పించడం మంత్రివర్గ విస్తరణ విషయంలో స్పష్టత వచ్చిందనే సంకేతాలను వెలువరించినా అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలో చేర్చుకోవడం విషయంలో ప్రత్యర్థి పార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసం కాంగ్రెస్ ఆయనను మంత్రివర్గంలో చేర్చుకున్నదని విమర్శ చేయడానికి ఆస్కారం కలిగింది. అజహరుద్దీన్ అసలు సిసలు హైదరాబాదీ. నారాయణగూడలోని విఠల్వాడి వాస్తవ్యుడు. ఆల్ సెయింట్స్ స్కూల్లో క్రికెట్ ఆట మొదలుపెట్టి భారత క్రికెట్ జట్టుకే కెప్టెన్ గా ఎదిగి రెండుసార్లు తన కెప్టెన్సీలో ఆసియా కప్ సాధించి, 1996 ప్రపంచ కప్ పోటీల్లో జట్టును సెమీఫైనల్స్ వరకు నడిపించిన అద్భుత క్రీడాకారుడు. క్రీడారంగంలో అత్యున్నత ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డు గ్రహీత, పద్మశ్రీ కూడా. అనేక ఎత్తుపల్లాలు



చూసినవాడు. 2009లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలక రాజకీయాలకు శ్రీకారం చుట్టి అదే సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ లోని మొరదాబాద్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో రాజస్థాన్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్లో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న బ్యాట్స్‌మెన్‌లో ఒకడిగా ప్రఖ్యాతి చెందిన అజహరుద్దీన్, మూడుసార్లు ప్రపంచకప్ పోటీలకు భారతజట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన అజహరుద్దీన్ 2012లో మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంలో ఇరుక్కుని భారత క్రికెట్ సంఘం బిసిసిఐ విధించిన జీవితకాలపు నిషేధానికి గురయ్యాడు. అయితే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ నిషేధాన్ని తర్వాత తొలగించింది. ఒకసారి ఆయన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై ఆ పదవిలో కూడా కొన్ని వివాదాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారంలో తలమునకలై ఉన్న రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి వర్గం అప్పట్లో హెచ్ సిఎ అధ్యక్షుడిగా అజహరుద్దీన్ వ్యవహారశైలి మీద తీవ్ర విమర్శలు చేసినవారే. ఇప్పుడు ఆ ఇద్దరూ మంత్రివర్గ సహచరులు. ఇక అజహరుద్దీన్‌ను జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలవడం కోసమే మంత్రివర్గంలోకి తీసుకున్నారని ప్రతిపక్షాలు సహజంగానే విమర్శిస్తున్నాయి.జూబ్లీహిల్స్‌లో ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ టికెట్ కోసం అజహరుద్దీన్ కూడా ప్రయత్నించినట్టు వార్తలు చదివాం. 2023లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినప్పుడు అప్పట్లో మజిలీస్ సహకారంతో పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌కు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కింది. అప్పట్లో అజహరుద్దీన్‌కు మద్దతు ఇవ్వకుండా స్వతంత్ర అభ్యర్థిని సమర్థించిన మజిలీస్ పార్టీ, ఈసారి తన అభ్యర్థిని పోటీకి నిలపకుండా నామినేషన్ సమయంలో కాకతాళీయంగా కనిపించే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను మజిలీస్ అగ్ర నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ కలిసి ఆల్ ది బెస్ట్ చెప్పడం తప్పనిసరిగా కాంగ్రెస్‌కు అనుకూల సంకేతాలనే పంపుతున్నది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ఏడు సెగ్మెంట్లలో కలిపి దాదాపు 1,20,000 ఓట్లు ముస్లిం మైనారిటీలవి ఉండటం గమనార్హం. ఫలితంపై ప్రభావం చూపగల సంఖ్యలో వారు ఉన్నారన్నది నిర్వివాదాంశం.ఈ ఉపఎన్నిక అన్ని పార్టీలకూ ప్రతిష్ఠాత్మకం. మామూలుగా ఉప ఎన్నికలను అధికారపక్షం అంత సీరియస్‌గా పట్టించుకోదు. అయితే ఇక్కడ రెండు ప్రతిపక్షాలు భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా ప్రజలకు మేలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రుజువు చేసేందుకు తాము గెలిచినా ఓడినా ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను ఓడించాలనే పట్టుదలతో ఉన్న విషయం తెలిసిందే. అందుకే కాంగ్రెస్ దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. కాబట్టే ముఖ్యమంత్రి స్వయంగా ప్రచారంలోకి దిగారు. తన సొంత స్థానం కాబట్టి మళ్లీ గెలుచుకోవాలనే పట్టుదలతో బిఆర్ఎస్ ఉంటే, భారతీయ జనతా పార్టీకి అందులోనూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇది అత్యంత ప్రధానమైన పోటీగా పరిణమించింది. అందుకు కారణం పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదింట మెజారిటీ సాధించి గెలిచిన కిషన్ రెడ్డి జూబ్లీహిల్స్, నాంపల్లి సెగ్మెంట్లలో మాత్రం వెనుకబడటంతో కాంగ్రెస్‌కు మెజారిటీ లభించింది. 2023 శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ స్థానంలో కాంగ్రెస్‌కు 64,212 ఓట్లు వస్తే, 2024లో లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు అదే స్థానంలో 89,705 ఓట్లు లభించాయి. దాదాపు 25 వేల ఓట్లు కాంగ్రెస్‌కు పెరిగాయి.2023లో 80,000కు పైగా ఓట్లు సాధించి గెలిచిన బిఆర్ఎస్, లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి 18 వేల ఓట్లకు పడిపోయింది. ఆ మేరకు బిజెపి లాభపడి దాదాపు 40 వేల ఓట్లు శాసనసభ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో పెంచుకున్నది. అయినా కాంగ్రెస్ కంటే తక్కువలోనే ఉన్న కారణంగా ఇది కిషన్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠగా మారింది. ఇక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లు మహాబద్ధకస్థులు. ఏ ఎన్నికకు ఆ ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరుగుతూ ఉంటుంది కానీ ఓటింగ్ శాతం మాత్రం తక్కువగానే ఉంటుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో 47.58% ఓట్లు పోలైతే సరిగా ఒక ఏడాదికి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అది 45.38 శాతానికి తగ్గింది. ఈసారైనా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చే నాయకుల ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి. మరో ముచ్చట.. పక్క రాష్ట్రంలో కూటమిలో భాగస్వామ్యపక్షాలైన టిడిపి, జనసేన పార్టీలు ప్రస్తుతం జూబ్లీహిల్స్ బరిలో ఉన్న తమ సహచర పార్టీ బిజెపి అభ్యర్థికి మద్దతు ఇచ్చే విషయంలో ఇప్పటివరకు నోరు మెదపలేదు. బిజెపి కూడా నోరు తెరిచి ఆ పార్టీ నేతల మద్దతు ఇంతవరకు కోరలేదు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రచారానికి వస్తున్నారని బిజెపి వర్గాల్లో ప్రచారం మాత్రం జరుగుతున్నది. మరోపక్క భారత రాష్ట్ర సమితి అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్

# ఇప్పుడు ఏడ చూసినా ఒక్కటే ముచ్చట..

హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు.. ప్రచారం జోరు పెంచిన ప్రధాన పార్టీలు.. గెలుపు మాదంటే మాదని ధీమా వ్యక్తం.. అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలందరూ జూబ్లీలో డోర్ టూ డోర్ ప్రచారం.. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, కీలక నేతలు గల్లి గల్లీ ప్రచారం.. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వినిపిస్తున్న మాట ఒక్కటే.. జూబ్లీ కింగ్ ఎవరు..? గెలిచేది అధికార కాంగ్రెస్ పార్టీనా..! బీఆర్ఎస్ పార్టీనా..! అనే అంశం గురించే జనాలు ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు.. ఈ రెండు పార్టీల మధ్యనే ప్రధాన పోటీ ఉందని బయట టాక్ ఎక్కువగా వినిపిస్తోంది. ఎట్లా అయిన జూబ్లీలో పాగా వేయాలని కాంగ్రెస్ పార్టీ.. ఉపఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో మళ్లీ పట్టు బిగించాలని బీఆర్ఎస్.. ఇలా రెండు పార్టీలు ప్రచార జోరును పెంచాయి. అయితే.. ఎవరికి ఎక్కువగా గెలిచే అవకాశం ఉంది..? బయట జనాలు ఏం మాట్లాడుకుంటున్నారు..? ప్రస్తుతం ఈక్వెషన్స్ ఎలా ఉన్నాయో క్లియర్ కట్ గా ఈ స్టోరీలో తెలుసుకుందాం..

ఈక్వెషన్స్ తారుమారు.. నిజమేనా?

సరిగ్గా నెల క్రితం.. జూబ్లీ ఉపఎన్నికల్లో ఈ సారి బీఆర్ఎస్ గెలిచే అవకాశం ఎక్కువ ఉందని అటు బయట.. ఇటు సోషల్ మీడియాలో ఎక్కువగా మాట్లాడుకున్నారు. అయితే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పేరు ప్రకటించక ముందు.. ప్రకటించిన తర్వాత ఈక్వేషన్స్ లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ హై కమాండ్ నవీన్ పేరును ప్రకటించన ఒకటి, రెండు రోజుల్లోనే గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది.. అసలు ఎవరీ నవీన్ యాదవ్..? ఇంతకు ముందు ఎన్ని సార్లు పోటీ చేశారు..? అనే విషయాల గురించి సోషల్ మీడియాలో ఎక్కువగా సెర్చ్ చేశారు. అయితే.. సానుభూతి అనే అంశం గురించి మాట్లాడితే.. చాలా మంది మాగంటి సునీతపై ఓటర్లు సింపతీ చూపించబోతున్నారనే టాక్ ఎక్కువగా నడిచింది.. కానీ అదే సింపతీ ఇప్పుడు రివర్స్ అయ్యింది.. నవీన్ కుమార్ యాదవ్ 2014, 2019, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా జూబ్లీ నుంచి పోటీచేయడం.. ఓడిపోవడం ఇవన్నీ లెక్కలోకి తీసుకుంటే ఓటర్లు ఈసారి నవీన్ యాదవ్ కు ఒక్క ఛాన్స్ ఇవ్వాలనుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

నవీన్ యాదవ్‌కు కలిసి వచ్చే అంశాలివే..

అలాగే.. అధికార కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం మద్దతు తెలపడం, గత కొన్నేళ్లుగా నవీన్ యాదవ్ నియోజకవర్గంలోనే ఉంటూ పేదలకు ఆసరగా నిలబడడం, కొన్ని రోజుల క్రితం సామూహిక సీమంతాలు చేయడం, బీసీ ప్రజల గురించి రేవంత్ సర్కార్ కీలక ఆలోచనలు చేయడం.. ఇవన్నీ నవీన్ యాదవ్ కు కలిసి వచ్చే అంశాలని రాజకీయ పండితులు భావిస్తున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ తీసుకున్న కీలక నిర్ణయం ఎమ్మెల్యే అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు ప్రకటించడమే అని మాట్లాడుకుంటున్నారు. ఈ అంశంతోనే ఒక్కసారిగా జూబ్లీలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరిగిందని తెగ మాట్లాడుకుంటున్నారు. అలాగే రాష్ట్ర మంత్రులందరూ జూబ్లీ లో డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించడం.. గడిచిన రెండేళ్ల నుంచి విజయవంతంగా అమలు అవుతోన్న సంక్షేమ పథకాల గురించి పూస గుచ్చినట్టు వివరించి చెప్పడం కూడా హస్తం పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


కాంగ్రెస్ కొంత ఇది మైనస్.. ఎలా అంటే?

అయితే కాంగ్రెస్ పార్టీకి సంబంధించి కొన్ని మైనస్ ల గురించి అక్కడక్కడ మాట్లాడుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయ్యింది.. మామూలుగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పడిన రెండు, మూడేళ్ల తర్వాత కొంత వ్యతిరేకత రావడం కామన్.. దీన్ని బీఆర్ఎస్ ప్రధాన అస్త్రంగా వాడుకుంటుంది. అలాగే రెండు రోజుల క్రితం నవీన్ యాదవ్ మాట్లాడే విధానం కూడా జనాలు గమనిస్తున్నారు. 'బీఆర్ఎస్ వాళ్లు ఎక్కువగా మాట్లాడితే.. జూబ్లీహిల్స్ గల్లీల నుంచి ఇంటికి కూడా వెళ్లలేరు' అని నవీన్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు కొంత నెగిటివ్ గా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే.. ఇంకో రెండు వారాల్లో ఎన్నికల పోలింగ్ పెట్టుకుని.. కాంగ్రెస్ సీనియర్ నేత అజారుద్దీన్ కు సీఎం రేవంత్ కేబినెట్ లో చోటు ఇవ్వడం.. వీటి గురించి జనాలు ఎక్కువగా మాట్లాడుకుంటున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో దాదాపు లక్షకు పైగా మైనార్టీ ఓట్ల కోసమే కేబినెట్ విస్తరణ చేస్తున్నారా..? ఎన్నికల కోడ్ సమయంలోనే మంత్రి పదవి ఇవ్వాళా..? అనే అంశం గురించి కూడా జనాలు మాట్లాడుకుంటున్నారు. ఈ అంశాలన్నీ కొంత నెగిటివ్ అయినప్పటికీ.. కాంగ్రెస్ కు పెద్దగా ఫరక్ పడకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

బీఆర్ఎస్ కు ప్లస్ పాయింట్ ఇది.. మరి గెలిచేది ఎవరో..?

నవీన్ యాదవ్ వ్యక్తిగత బలం ఉన్నప్పటికీ, కొన్ని పార్టీ పరమైన, రాజకీయపరమైన సవాళ్లను అధిగమించాల్సి ఉంది. దివంగత నేత మాగంటి గోపీనాథ్ సెంటిమెంట్ బీఆర్ఎస్ కు కొంత ప్లస్ పాయింట్ అని చెప్పవచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కంటోన్మెంట్ ఉప ఎన్నిక గెలిచినంత సులభంగా ఇది ఉండకపోవచ్చు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు కావడంతో, ప్రభుత్వంపై సహజంగా వచ్చే ప్రభుత్వ వ్యతిరేకతను నవీన్ యాదవ్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. నవీన్ యాదవ్ తన వ్యక్తిగత బలం, యువత మద్దతు, బీసీ కోటా వంటి సానుకూల అంశాలతో బరిలోకి దిగుతున్నప్పటికీ.. మాగంటి గోపీనాథ్ సెంటిమెంట్, మైనార్టీ ఓటర్ల సమీకరణ, బీఆర్ఎస్ నగర ప్రాబల్యం వంటి ప్రధాన సవాళ్లను అధిగమించగలిగితేనే నవీన్ యాదవ్ జూబ్లీ కింగ్ అయ్యే అవకాశం ఉంది. ఈ అంశాల ప్రభావం ఎంతవరకు ఉంటుందనేది నవంబర్ 14న ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాలి.

# కాశీబుగ్గలో తొక్కిసలాటకు ఇదేనా అసలు కారణం!



శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే, ఈ స్థాయిలో భక్తులు తరలిరావడానికి.. తొక్కిసలాట జరిగే స్థాయిలో చేరుకోవడానికి సోషల్ మీడియాలో జరిగిన అతి ప్రచారం కూడా ఓ కారణం అని అంటున్నారు. విశాఖలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆహారోత్సవంలోనూ ఇదే జరిగిందని అంటున్నారు.అవును... పర్వదినాల్లో ఫలానా ఆలయాన్ని సందర్శించి పూజలు చేస్తే పుణ్యం లభిస్తుందనే తరహా ప్రచారం ఇటీవల సోషల్ మీడియాలో జోరందుకున్న సంగతి తెలిసిందే. దీంతో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కొన్ని దేవాలయాల వద్ద గతంలో ఎన్నడూ లేని స్థాయిలో భక్తులు చేరుకుంటున్నారు. తాజాగా కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ అదే జరిగిందని అంటున్నారు. ఈ ఘటనలో 9 మంది మృతి చెందారు.కాశీబుగ్గలో ఆలయం గురించి ఇటీవల సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారం జరిగింది. ఇందులో భాగంగా... తిరుమలలో స్వామి దర్శనానికి వెళ్లగా చేదు అనుభవం ఎదురైందనే కారణంతో రూ.20 కోట్లతో 12 ఎకరాల సొంత పొలంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారని.. 92 ఏళ్ల వయసులోనూ హరిముకుంద్ పండా దగ్గరుండి ఈ ఆలయ నిర్వహణ చూస్తున్నారంటూ ఓ వీడియో వైరల్ అయింది.ఈ నేపథ్యంలోనే.. కార్తిక ఏకాదశి రోజైన శనివారం పూజలకు అంచనాకు మించి భక్తులు వచ్చారు. పరిస్థితి తొక్కిసలాటకు దారి తీసి అమాయక భక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

అంతులేని నిర్లక్ష్యం!:

కాశీబుగ్గలో శనివారం చోటుచేసుకున్న దుర్ఘటనకు నిర్వహణ లోపం, భద్రతను పట్టించుకోకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. పాత జాతీయ రహదారికి, రైల్వే, బస్ స్టేషన్లకు సమీపంలో ఉండటంతో పాటు సోషల్ మీడియాలో ప్రచారం నేపథ్యంలో ఈ ప్రైవేటు ఆలయానికి రోజుకు రెండు వేల మంది వరకు భక్తులు వస్తుంటారు.దీనికితోడు శనివారం, పండుగరోజుల్లో అన్నసంతర్పణ నిర్వహిస్తుండటంతో ఈ సంఖ్య పెరుగుతుంది. అయినప్పటికీ ఆలయ యాజమాన్యం వైపు నుంచి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని అంటున్నారు. మరోవైపు ఆలయానికి పెద్దఎత్తున భక్తులు వస్తున్నా పోలీసులు భద్రతపై దృష్టిపెట్టలేదని.. ఆ మార్గంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు.

# ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

విజయవాడ, కృష్ణానదిలో వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ సమానంగా ఉండి భారీ నీటి ప్రవాహం కొనసాగుతోంది. తాజా వివరాల ప్రకారం, బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ 5,38,867 లక్షల క్యూసెక్కులుగా నమోదయ్యాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, కృష్ణా నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదు. లోతట్టు ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, నంద్యాల జిల్లాల్లో రోడ్డు రవాణా అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వరద ప్రభావిత మండలాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, వచ్చే 24 గంటల్లో కూడా కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ విభాగం విజ్ఞప్తి చేసింది.

# పివోకెలో మానవహక్కుల ఉల్లంఘన

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికగా పాకిస్తాన్ కు మరోసారి భంగపాటు ఎదురైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల బహిరంగ తిరుగుబాటును అక్కడి దళాలు అణచివేస్తున్నాయని, అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను వెంటనే ఆపాలని భారత్ (ఎనిటతిజీ) డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చ సందర్భంగా మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ మాట్లాడుతూ.. పాక్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పీవోకేలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని వెంటనే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. 'ఆ ప్రాంతంలోని ప్రజలు ప్రాథమిక హక్కు స్వేచ్ఛ కోసం చేస్తున్న తిరుగుబాటును ఆ దేశ దళాలు అణచివేస్తున్నాయి. ఈ క్రమంలో అనేకమంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు' అని ఆమె పేర్కొన్నారు. ఐరాసలో జరిగే చర్చల్లో భారత్‌పై నిందలు మోపేందుకు ఆ దేశ దౌత్యవేత్తలు చేస్తున్న ప్రయత్నాలను ఆమె తప్పుబట్టారు. పాక్ ద్వంద్వవైఖరి, కపటత్వంపై సమయం వెచ్చించడం, దృష్టిపెట్టాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యంపై పాక్ చేస్తున్న ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. వారి ఆరోపణలు, అబద్ధాలు వాస్తవాలను మార్చలేవని భవిక అన్నారు. ఇటీవల కశ్మీరీ ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్న విషయాన్ని ఆమె ఇక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా ఆ దేశ సామాజిక, ఆర్థిక పురోగతి గురించి అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని మంగళానందన్ పునరుద్ఘాటించారు. ఈ క్రమంలో మానవ హక్కుల పరిరక్షకుడు భారత్ తీసుకుంటున్న చర్యలను ఆమె ఎత్తి చూపారు.

## పెట్రేగిపోతున్న కామాంధులు

హైదరాబాద్, అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడో కామాంధుడు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతీరోజు లాగే బాధితురాలు తన విధులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఉన్నట్టుండి ఓ వ్యక్తి ఆమెను బలవంతం చేశాడు. ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై కార్మికురాలిపై రాజు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దారుణ ఘటనపై బాధిత మహిళ బోరబండ పోలీసులను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో రాజు.. పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. నిందితుడు మోడల్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. ఇదిలావుంటే ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో దారుణం జరిగింది. బాలిక (13)పై సామూహిక అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ బాలుడు వచ్చి 'నీ తమ్ముడు కింద పడిపోయాడు' అని బాలికకు మాయమాటలు చెప్పి ఓ ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఇద్దరు బాలురతో కలిసి ఓ యువకుడు.. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు పని మీద హైదరాబాద్ వెళ్లగా, ఇంట్లో ఉన్న నానమ్మ, తాతయ్య బయటకు వెళ్లారు. బాలిక తల్లి.. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారికోసం గాలిస్తున్నామని అన్నారు.


## బాధ్యులపై తక్షణ చర్యలకు డిమాండ్

విశాఖపట్నం, విశాఖ సమతా డిగ్రీ కళాశాల వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. విద్యార్థి సాయితేజ మృతిపై కళాశాల యాజమాన్యం ఇప్పటివరకు స్పందించకపోవడంతో కుటుంబసభ్యులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ గేట్లు, పోలీసులను తోసుకుంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు మృతుడు సాయితేజ కుటుంబసభ్యులకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. నిందితులను శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగిన వారిని శాంతింప చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఎట్టకేలకు వారిని ధర్నా విరమించేందుకు ఒప్పించారు. ధర్నా అనంతరం ఈ ఘటనపై ద్వారక ఏసీపీ అన్నెపు నరసింహ స్పందించారు. బాధితులు కేసును నిస్పక్షపాతంగా దర్యాప్తు చేయమన్నారని, వారి డిమాండ్స్‌ను కాలేజ్ యాజమాన్యం పరిశీలించిందని తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు డిజిటల్ ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. అటు సైబర్ క్రైమ్, ఉమెన్ సెల్ లోతైన విచారణ చేస్తున్నాయని వెల్లడించారు. ఇది చాలా సెన్సిటివ్ కేసు అని, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని చెప్పారు. సెన్సిటివ్ కేసు కాబట్టి ఎవరి మీదా నిందలు వేయలేమన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మహిళా సిబ్బందిని కాలేజ్ యాజమాన్యం తాత్కాలికంగా విధుల నుంచి తొలగించిందని వెల్లడించారు. కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వివరాలు ఎప్పటికప్పుడు కుటుంబసభ్యులకి అందజేస్తామని ఏసీపీ అన్నెపు నరసింహ స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సాయితేజ అనే విద్యార్థి సమతా డిగ్రీ కాలేజ్‌లో బీసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అయితే, పరీక్షల సమయంలో ఓ మహిళా లెక్చరర్ తనను ఇబ్బంది పెడుతుందని, మార్కులు కావాలనే సరిగా వేయడం లేదని, రికార్డులు పదే పదే రాయిస్తున్నారని తల్లిదండ్రులకు సాయితేజ తెలిపాడు. తనను వేధిస్తున్న లెక్చరర్.. రికార్డులపై సంతకాలు చేయడం లేదని, మీరు వెళ్లి సంతకాలు పెట్టించుకుని రావాలని తల్లిదండ్రులకు చెప్పి పంపించాడు. కుమారుడు సాయితేజ చెప్పినట్టుగానే తల్లిదండ్రులు లెక్చరర్ ఇంటికి వెళ్లి సంతకాలు చేయించుకుని ఇంటికి వచ్చారు. అయితే, ఇంటికి వచ్చిన వారికి చివరికి కడుపుకోత మిగిలింది. సాయితేజ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో బాధిత తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మహిళా లెక్చరర్ పదే పదే మెసేజ్‌లు పెట్టి వేధించడంతోనే సాయితేజ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజ్ యాజమాన్యం విద్యార్థి సాయితేజ ఘటనపై స్పందించాలని, వేధించిన లెక్చరర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబానికి చెక్కు అందించిన గంటా**

విశాఖపట్నం, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మద్ది పంచాయతీ భీమ పాలెం గ్రామానికి చెందిన కాళ్ల ధనశ్రీ గత నెల 30న పల్లి గెడ్డలో గల్లంతై మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

# జూబ్లీహిల్స్‌లో బీజేపీ పరిస్థితి ఏంటి!



హైదరాబాద్,కార్పెట్ బాంబింగ్ పేరుతో బీజేపీ చేస్తున్న పాదయాత్ర జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుకున్న ఫలితాలను తెచ్చిపెడుతుందా.? అంత ఆయనదే బాధ్యత అంటూ సొంత పార్టీ నేతలు చేస్తున్న స్టేట్ మెంట్స్, ఆ మంత్రికి చిర్రెత్తిస్తున్నాయా..? నేతల మధ్య సమన్వయం లోపించిందంతో సునీల్ బన్సల్ రంగంలోకి దిగారా..? అసలు అక్కడ మిగిలిన ఎంపీలు జూబ్లీహిల్స్ అంతర్భాగంగా ఉన్న సికింద్రాబాద్ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సహకరించడం లేదా? లేకపోతే తన సెగ్మెంట్లో మిగిలిన వారి జోక్యం ఏంటని కిషన్‌రెడ్డే వారిని దూరంగా ఉంచుతున్నారా?

సతమతమవుతున్న కమలం పార్టీ:

ఆచరణ లేదు కానీ లక్ష్యం మాత్రం పెద్దగా ఉంది, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి అటు నుయ్యి, ఇటు గొయ్యి అన్నట్టుగా తయారైందనే చర్చ జరుగుతుంది. ఇటు సొంత నేతలతో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోలేక, అటు అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ల ఎత్తుగడలను అంచనా వేయలేక కమలం పార్టీ సతమతమవుతుందట.. ప్రచారాన్ని హోరెత్తించేందుకు కార్పెట్ బాంబింగ్ లతో ఎన్ని విశ్వప్రయత్నాలు చేసినా, అనుకున్నదొక్కటి, అవుతున్నది మరొకటి అన్నట్టుగా ఉందట.

హిందువులంతా ఏకం అవ్వండి అంటున్న బీజేపీ:

జూబ్లీహిల్స్ గ్రౌండ్ లెవల్లో ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో ఆదరణ రావడం లేదని, ఒకేసారి ఏడు డివిజన్లలో 60 చోట్ల కార్పెట్ బాంబింగ్ పేరుతో ముఖ్య నేతలంతా మెగా పాదయాత్ర నిర్వహించినా.. ఎలాంటి రిజల్ట్స్ కనిపించడం లేదనే టాక్ ఆ పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది. జూబ్లీహిల్స్ లో ఒక్కసారి అవకాశం ఇవ్వండి, జూబ్లీహిల్స్ లో హిందువులంతా ఏకం అవ్వండి మోడీ అభివృద్ధి కార్డ్ చూడండి అంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారాలు జూబ్లీహిల్స్ ప్రజలు బుర్రకెక్కించుకుంటారా..? లేక లైట్ తీసుకుంటారా..? అన్నది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

కిషన్ రెడ్డిని టార్గెట్ చేస్తున్న ధర్మపురి అరవింద్:

సమయం లేదు 10 రోజులు మాత్రమే ఇట్లాంటి పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ గడ్డ కిషన్ రెడ్డి అడ్డా, ఈ ఎన్నిక కిషన్ రెడ్డిదే బాధ్యత, మాకేంటి సంబంధం..? వంటి సొంత పార్టీ నేతలు చేస్తున్న స్టేట్మెంట్లు కిషన్ రెడ్డికి చిర్రెత్తిస్తున్నాయట..ఆడలేక మంగళవారం అన్నట్టూ ప్రచారంలో పాల్గొనకుండా ధర్మపురి అరవింద్ లాంటి నేతలు నేరుగా కిషన్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఒక ఎంపీగా బాధ్యత ఉండొచ్చు, కిషన్ రెడ్డి పార్లమెంట్ పరిధిలో ఎన్నిక జరుగుతుండొచ్చు, కానీ పార్టీ కిషన్ రెడ్డే కాదు కదా..? అందరూ కలిస్తేనే పార్టీ, సమన్వయంతో ముందుకు వెళ్తేనే విజయం. కానీ అందుకు విరుద్ధంగా కొంతమంది నేతల వ్యవహారం కిషన్ రెడ్డినే కాదు, పార్టీని కూడా అవమానించినట్టుగా ఉందనే టాక్ నడుస్తోంది. ఇక మరోవైపు ఉప ఎన్నిక ఎపిసోడ్ లో మరే ఇతర నేతలను ఇన్వాల్వ్ కాకుండా కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, అందులో భాగంగానే ప్రచారంలో కీలక నేతలెవరూ పాలు పంచుకోవడం లేదనే చర్చ సైతం నడుస్తోంది. జూబ్లీహిల్స్ గడ్డపై కాషాయ జెండా ఎగరడమేమో కానీ, నేతల మధ్య రగడలు మాత్రం జూబ్లీహిల్స్ గడ్డపై రచ్చ చేస్తున్నాయి. ఎలుకను పిలిస్తే పిల్లికి కోపం, పిల్లిని పిలిస్తే ఎలుకకు కోపం అన్నట్టుగా ఉన్నాయట కాషాయ పార్టీలో నేతల పంచాయతీలు.

సింగిల్ గానే ప్రచారం చేపట్టాలని కిషన్‌రెడ్డి నిర్ణయం:

ఇక నేతల మధ్య ఎదరవుతున్న సవాళ్లను తీసి పక్కన పడేశారట కిషన్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారనే టాక్ నడుస్తోంది. ఆయన లోక్ సభ పరిధి కాబట్టి గెలుపు కిషన్ రెడ్డికి కీలకం కానుంది. దీంతో కీలక నేతలు ప్రచారానికి ఎవరు వచ్చినా రాకున్నా.. సింగిల్ గానే ప్రచారం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. పొద్దు పోయేంతవరకు జూబ్లీహిల్స్ లోనే జోరు వానలో జోరుగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచారంలో అన్నీ తానై ముందుకు నడిపిస్తున్నారు. ఈ ఉప ఎన్నికల్లో సత్తా చాటి వచ్చే ఎన్నికలకు లైన్ క్లియర్ చేసుకోవాలని పార్టీ నేతలు ఆ దిశగా ముందడుగు వేయడంలేదని ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో, ఈ బైపోల్ బాధ్యతలు కిషన్ రెడ్డి తీసుకున్నారనే టాక్ నడుస్తోంది.

చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగిన సునీల్ బన్సల్:

పార్టీలోని కీలక నేతలెవరూ రెగ్యులర్ గా ప్రచారంలో కనిపించడంలేదని, అడపాదడపా ఇలా వచ్చి అలా వెళ్లిపోతూ కేవలం అటెండెన్స్ కే పరిమితమవుతున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. ఈ పంచాయితీలకు చెక్ పెట్టేందుకు సునీల్ బన్సల్ రంగంలోకి దిగినట్టుగా తెలుస్తోంది. ఉప్ప ఎన్నిక బీజేపీకి కీలకం అయిన నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నిక తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన బన్సల్ నేతల బోల్ట్ లు బిగిస్తారనే టాక్ నడుస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ తో పాటు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, జూబ్లీహిల్స్ ఎన్నికపై కమిటీల ఇంచార్జీలతో వరసగా సమావేశాలు నిర్వహించి, నేతలకు దిశ నిర్దేశం చేసే పని పెట్టుకున్నట్టుగా తెలుస్తోంది. నేతల వ్యవహార శైలిపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్టుగా తెలుస్తోంది.

తెలంగాణ ప్రచారానికి రానున్న భజన్ లాల్ శర్మ:

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 ఎమ్మెల్యేలు, 3 ఎమ్మెల్సీలు , రాజ్యసభ సభ్యులు ఉండి, ఒక ఉప ఎన్నికపై ఫోకస్ చేయకపోవడంపై బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టుగా తెలుస్తోంది. అయితే సునీల్ బన్సల్ ఇచ్చే స్ట్రోక్ తో రాష్ట్ర నేతల్లో మార్పు వస్తుందా..? లేక మళ్ళీ అదే తంతూ కొనసాగిస్తారా అన్నది అటుంచితే ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఢీల్లీ పెద్దలు స్టార్ క్యాంపెనియర్లను ప్రకటించారు. ఆ జాబితాలో నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘ్వాల్, శ్రీనివాస్ వర్మ ఉన్నారు. వారితో పాటు రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ సైతం తెలంగాణ ప్రచారానికి రానున్నారు.

స్టార్ క్యాంపెయినర్లుగా ఎంట్రీ ఇవ్వబోతున్న వారి పేర్లు ఇవే..

జూబ్లీహిల్స్‌లో సెటిలర్లకు గాలం వేయడానికి ఆంధ్రప్రదేశ్ కు చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్టార్ క్యాంపెయినర్లుగా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య సైతం ఆ జాబితాలో ఉన్నారు. వీరిలో మాధవ్ ఇప్పటికే తెలంగాణ నేతలను కలిసి ప్రచారంలో పాల్గొంటానని, ఇరు రాష్ట్రాల నేతలం కలిసికట్టుగా జూబ్లీహిల్స్ గెలుపుకు కృషి చేస్తామని ప్రకటించుకొచ్చారు. ఇక వరసగా ప్రచార కర్తలంతా జూబ్లీహిల్స్ కు క్యూ కట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇట్లాంటి నేపద్యంలో రాష్ట్ర నేతల కోఆర్డినేషన్ ఏ విధంగా ఉంటుంది. కలిసి నడుస్తారా..? లేక మళ్ళీ కిషన్ రెడ్డిదే బాధ్యత అంటూ పాత పాటే పాడతారా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

# అవినీతి భరతం పట్టేదెవరు?



గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రజాస్వామ్యాన్ని ప్రజలచే ఏర్పడే ప్రజల ప్రభుత్వంగా వివరించాడు. అనంతరం ప్రముఖ అమెరికా దేశ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారానే నడిచే ప్రభుత్వం అని అద్భుతంగా నిర్వచించాడు. కాలక్రమేణా ఈ భావన ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, అనేక దేశాల పాలనా విధానాలకు మార్గదర్శకంగా నిలిచింది. భారతదేశం కూడా తన రాజ్యాంగ ప్రవేశికలో భారతదేశం ఒక ప్రజాస్వామ్య గణతంత్ర దేశం అని గర్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం అనేది ప్రజల సంకల్పానికి ప్రతిబింబం, ప్రజల హక్కులకు పరిరక్షణ, ప్రజల శ్రేయస్సుకై నడిచే పటిష్టమైన జవాబుదారీ పాలనా విధానం. రాచరిక వ్యవస్థలను రూపుమాపి, ప్రజలే ప్రభువులు అనే భావంతో ఏర్పడిన ప్రజాస్వామ్యంలో రాజకీయం ప్రధాన పాత్రను పోషిస్తుంది. రాజకీయం అంటే ప్రజా శ్రేయస్సు కోసం అవసరమైన ప్రణాళికలను సిద్ధంచేసి, వాటిని సక్రమంగా అమలు చేయడానికి పన్నే యుక్తి. ప్రజాస్వామ్యంలో ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కోసం అవసరమైన పాలన యుక్తులను పన్నే ప్రజా నాయకులను ప్రజలే ఎన్నుకుంటారుబీ వారినే రాజకీయ నాయకులు అంటారు. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజకీయం అంటే పాలనా యుక్తి. ఆ యుక్తిని అమలు చేసే వారిని రాజకీయ నాయకులని అంటారు. కానీ నేటి పరిస్థితుల్లో రాజకీయం అంటే ఒకటి చెప్పి మరొకటి చేసే కుయుక్తిగా, నమ్మించి మోసం చేసే సాధనంగా మారిపోయింది. ఒకప్పుడు పాలనాదక్షతకు ప్రతీకగా ఉన్న రాజకీయం నేడు కపటానికి ప్రతిరూపంగా మారిపోతోంది. రాజకీయం చేయడం అనేది ఇప్పుడు ఒక మోసపూరితమైన మాటగా మిగిలిపోతోంది. మన కులమని, మన మతమని, మన ప్రాంతమని ప్రజలను ఎక్కడికక్కడ విభజిస్తూ తమ కుయుక్తులను పన్నుతున్నారు నేటి రాజకీయ నాయకులు. దీంతో రాజకీయాలు రోజురోజుకీ మరింత దిగజారిపోతూ ప్రజాస్వామ్యం పునాదులను కదిలించి వేస్తున్నాయి. ప్రస్తుత రాజకీయ నాయకుల ఆలోచనా విధానంలో, మానసిక స్థితిలో గణనీయమైన అనైతిక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతి చిన్న కార్యక్రమాన్నీ ఎంతో గొప్పగా చెప్పుకునే నాయకులు, అదే కార్యక్రమాలను వారి ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు నిర్వహిస్తే, వారిని తీవ్ర పదజాలంతో విమర్శించడం నేటి రాజకీయ సంస్కృతిగా మారిపోయింది. ఒక రాజకీయ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని గుడ్డిగా మరో పార్టీ వ్యతిరేకించడమే రాజకీయమని భావించే పరిస్థితి ఏర్పడింది. ప్రెస్‌మీట్లు పెట్టి నిర్మాణాత్మక చర్చలను జరపకుండా, సద్విమర్శలను చేయకుండా, మంచి సలహాలను సూచించకుండా ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు, పరుష పదజాలంతో దూషణలు చేసుకుంటూ, ప్రజాభివృద్ధికి ఉపయోగించవలసిన విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. నేటి రాజకీయ పార్టీలు ప్రజల కోసం పనిచేసే అత్యుత్తమ సేవా రంగాలుగా కాకుండా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే అవినీతి వ్యాపార సంస్థలుగా మారిపోతున్నాయి. రాజకీయ పార్టీలు వాటిని నడిపే నాయకుల ఆలోచనా ధోరణి ఈ విధంగా ఉంటే ప్రజాస్వామ్య విలువలు క్రమక్రమంగా అంతరించిపోయి, ప్రజా ప్రభుత్వాలలో 'ప్రజా' అనే పదం పోయి ప్రభుత్వాలు మాత్రమే మిగులుతాయి. ప్రజల ఓటు ద్వారా ఎన్నిక కాబడిన ప్రజా ప్రభుత్వాలు ప్రజలకు శాశ్వతమైన అభివృద్ధిని అందించకుండా వారిని ఆకర్షించడానికి ఎటువంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయి. సమాజ, దేశ అభివృద్ధి కంటే వారి పార్టీ ప్రయోజనాలే ప్రధానమనేలా రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రజల ఓట్ల కోసం తప్పు అని తెలిసినా తప్పుడు హామీలు ఇస్తూ ప్రజల బలహీనతలతో ఆడుకుంటున్నారు ఈ రాజకీయ నాయకులు. ప్రజలు కూడా తాత్కాలికమైన ప్రయోజనాలకు ఆశపడి అప్రయోజకులను తమ నాయకులుగా ఎన్నుకొని వారి అభివృద్ధిని వారే నాశనం చేసుకుంటున్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ప్రభుత్వాలు మారుతున్నా, పాలనా విధానాలలో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు. ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా సమాజ అభివృద్ధి కంటే వారి పార్టీ అభివృద్ధికే పెద్దపీట వేస్తుంది. నేటి ప్రజాస్వామ్యంలో ప్రజలు ఐదేళ్లకోసారి, ఓటు వేసే ముందు మాత్రమే ఈ రాజకీయ నాయకులకు కనిపిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యపు అర్థాన్ని అపహాస్యం చేస్తుంది. రాజకీయ నాయకులు చేసే అక్రమాలు, తప్పులను, వారిని గుడ్డిగా అభిమానించే అభిమానులు ఏమాత్రం ఆలోచించకుండా సమర్థిస్తూ ఉంటారు. వారు అభిమానించే నాయకుడు తప్పు చేసినప్పుడు అతనిని ఎవరైనా విమర్శిస్తే, ఈ అభిమానులు సామాజిక మాధ్యమాలలో తమ నాయకుడిని విమర్శించిన వారిపై విపరీతమైన దుర్భాషలతో పోస్టులు పెడుతున్నారు. విమర్శించిన వారిని కించపరిచే విధంగా మీమ్స్, మార్ఫిడి ఫోటోలు అసభ్యంగా తయారు చేసి షేర్ చేస్తున్నారు. ఇది సమాజానికి చేటుచేసే విష సంస్కృతి. నిజమైన అభిమానం అంటే, ఒక నాయకుడిని గుడ్డిగా సమర్థించడం కాదు. ఆ నాయకుడు చేసే మంచి పనుల నుంచి స్ఫూర్తిని పొందడం, తప్పు జరిగినప్పుడు సద్విమర్శలు చేయడం. కానీ, గుడ్డి అభిమానంతో అసభ్యకరమైన చర్చలు, పోస్టులు సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తూ సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారు ఈ అభిమానులు. నేటి రాజకీయ నాయకులు మాయ మాటలతో అభిమానులను రెచ్చగొట్టి వారి స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. ఇలాంటి ఆలోచనా విధానాన్ని నాయకులు మార్చుకోవాలి. లేకపోతే సమాజంలో ఐక్యత దెబ్బతింటుంది.

# ఆపరేషన్ సిందూర్ 2.0 కు సిద్దంగా ఉన్నాం

భోపాల్,అఫ్ఘానిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పై నోరు పారేసుకుంటున్న పాక్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ మరోమారు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పాక్ మళ్లీ ఏదైనా మూర్ఖపు చర్యకు దిగితే ఆపరేషన్ సిందూర్ రెండో రౌండ్‌కు తాము రెడీగా ఉన్నామని అన్నారు. ఆపరేషన్ సింధూర్ 2.0కు భారత సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయి. త్రివిధ దళాధిపతులు సాయుధ దళాలను ముందుండి నడిపిస్తే మమల్ని ఎవరూ ఎదుర్కోలేరని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాలోని సైనిక్ స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు ఎప్పుడో భారత్ తప్ప ఇతరులెవరూ నిర్ణయించలేరని కూడా తేల్చి చెప్పారు. పాక్ తగిన గుణపాఠం నేర్చుకుందని తాము భావించినప్పుడే ఆపరేషన్ సిందూర్ ముగుస్తుందని అన్నారు. సైన్యానికి నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నావికాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ ఇద్దరూ 1970ల్లో కలిసి చదువుకున్నారు. అప్పట్లో రేవా సైనిక్ స్కూల్లో క్లాస్ 5ఏ తరగతిలో క్లాస్ మేట్స్‌గా ఉన్నారు. ఆ తరువాత ఇద్దరు అంచెలంచెలుగా ఎదుగుతూ సాయుధ దళాల అధిపతులయ్యారు. భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం ఉందని ఇటీవల పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈసారి యుద్ధంలో తాము గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని కూడా అన్నారు. ఈ నేపథ్యంలో భారత ఆర్మీ ఛీఫ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడికి ప్రతీకారంలో భారత్ మే 6,7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేసి పాక్ పాలక వర్గానికి, అక్కడి ఉగ్రమూకలకు వెన్నులో వణుకు పుట్టించింది.

# తెలంగాణలో సాధ్యమా?

హైదరాబాద్,ఆశ పడవచ్చు. కానీ ఆ ఆశకు హద్దు ఉండాలి.. అర్హత ఉండాలి. దానిని సాధించాలి అన్న తపన ఉండాలి. కష్టపడాలి. అందరినీ కలుపుకుపోవాలి. రాజకీయాల్లో నేతలకు ఆశలు ఎక్కువ. పదవీ వ్యామోహంతోపాటు, సంపాదించాలి.. కీలక పదవులు అలంకరించాలని ఆశపడతుంటారు. చాలా మందికి అవి నెరవేరవు. కొందరికి అదృష్టంతో కలిసి వస్తాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ నేతల ఆశలు చూస్తే మాత్రం అత్యాశే అనిపిస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన చాలా హామీలు నెరవేర్చలేదు. ఇక హైడ్రా, ధాన్యానికి బోనస్, పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2,500 సాయం, విద్యార్థినులకు స్కూటీలు వంటివి అమలుకు నోచుకోలేదు. హైడ్రా హైదరాబాద్ వాసులను దెబ్బతీస్తోంది. ఇలాంటి తరుణంలో హస్తం నేతలు తాము రాబోయే 30 ఏళ్లు అధికారంలో ఉంటామని వ్యాఖ్యానించడం కొత్త చర్చకు దారితీసింది. మొన్నటి వరకు రేవంత్‌రెడ్డి పదేళ్లు నేనే సీఎం అని ప్రకటించారు. ఇప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు 30 ఏళ్లు తమదే అధికారం అని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో మాజీ క్రికెట్ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ మంత్రి పదవి గురించి 'మీడియాలోనే తెలిసింది, నాకు అధికారిక సమాచారం లేదు' అని చెప్పడం పార్టీలో అంతర్గత విభేదాలకు నిదర్శనం.

ఆశా.. అత్యాశా..?

శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత, పార్టీ 'రైజింగ్ తెలంగాణ' విజన్‌తో ముందుకు సాగుతోంది. ఆరు హామీల అమలు, ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి చర్యలు ప్రజల్లో బలం పెంచాయి. అయితే 30 ఏళ్లు అధికారం అత్యాశే అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీజేపీ బలపడటం, బీఆర్ఎస్ పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హామీలు నెరవర్చేకపోవడం పెద్ద మైనస్.

బలమా, బలహీనతమా?

కాంగ్రెస్‌లో మంత్రులు బహిరంగంగా వ్యాఖలు వివాదాస్పదమవుతున్నాయి. దీనిపై శ్రీధర్‌బాబు స్పందిస్తూ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ అని పేర్కొన్నారు. ఇది ఒకవైపు సానుకూలం.. మరోవైపు బలహీనత కూడా. కాంగ్రెస్ అంటేనే కుమ్ములాటలు. ఒకరి ఎదుగుదలను మరొకరు ఓర్వలేనంత ప్రజాస్వామ్యం. ఇలాంటి పార్టీ ప్రజలను ఆకట్టుకుని 30 ఏళ్లు అధికారంలో ఉండడం అంత ఈజీ కాదు.


సవాళ్లు.. అవకాశాలు..

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అంతర్గత విభేదాలు, విపక్షాల పునరుజ్జీవనం, ఆర్థిక సమస్యలు. బీఆర్ఎస్ యువతను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. బీజేపీ జాతీయ అంశాలతో బలపడుతోంది. అయితే, యువత ఉద్యోగాలు, మహిళల సాధికారత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వంటివి పార్టీని బలపరుస్తాయి. శ్రీధర్ బాబు వంటి నాయకులు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, ఏకత్వాన్ని కాపాడితే, ఈ కల సాధ్యం కావొచ్చు. కానీ రాజకీయ చరిత్ర చూస్తే, దీర్ఘకాలిక ఆధిపత్యం పాలసీలపై ఆధారపడి ఉంటుంది, వ్యక్తిగత వ్యాఖ్యలపై కాదు.శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ధైర్యాన్ని చూపిస్తున్నాయి, కానీ అవి పరీక్షల సూచనలు కూడా. 30 ఏళ్లు ఆధిపత్యం కలలు కాకుండా నిజమవ్వాలంటే, అంతర్గత ఏకత్వం, పారదర్శకత, ప్రజా సంక్షేమం మీద దృష్టి పెట్టాలి. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటారు కాంగ్రెస్ దాన్ని అందిస్తే, ఈ కల నిజమవుతుంది. లేకపోతే, రాజకీయాల్లో ఆర్పు తప్పదు.

# హాట్ టాపిక్...

అమరావతి,ఏపీలో కూటమి ప్రభుత్వం మంచి సమన్వయంతో పనిచేస్తోంది. కూటమిలో గిల్లికజ్జాలు తేవడానికి ప్రత్యర్థులు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. ముగ్గురు ముఖ్యనేతలు అవగాహనతో పనిచేస్తూ వివాదాలు దూరంగా ఉంటున్నారని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, యువనేత, మంత్రి లోకేశ్ పనితీరును గమనిస్తే వారి ముగ్గురి మధ్య బాండింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని, ఇదే పద్ధతి కొనసాగితే ప్రత్యర్థులు త ఆశలపై నీళు కుమ్మరించుకుని మరికొన్నేళ్లు వెయిట్ చేయక తప్పదని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉన్నప్పటికీ ప్రధానంగా ముగ్గురు నాయకుల చుట్టూనే రాజకీయం తిరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ పర్యవేక్షణలోనే ప్రభుత్వం నడుస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ ఇద్దరూ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకోడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ఈ విషయంలో ఇద్దరూ ఒకరితో ఒకరి పోటీపడకండా సర్దుకుపోయేలా వ్యవహరించడమే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఏపీని వణికించిన మొంథా తుఫాన్ తర్వాత ముగ్గురు నేతల వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ నడుస్తోంది. తుఫాన్ ముందస్తు సన్నద్ధతలో ముగ్గురు నేతలు కలిసి పనిచేయగా, ఆ తర్వాత ఒక్కొక్కరు ఒక్కో బాధ్యతను తీసుకోవడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత తుఫాన్ బాధితుల పరామర్శకు వెళ్లి ఆ తర్వాత దైనందన ప్రభుత్వ కార్యక్రమాలల్లో బిజీ అయిపోయారు. ఇదే సమయంలో పవన్ పూర్తిగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి

# వైసీపీకి నో చాన్స్...బాబు రాజకీయ మంత్రాంగం !



అమరావతి,ఏపీలో రెండు పార్టీల వ్యవస్థ కొనసాగుతోంది. ఒక పార్టీ అయిదేళ్ళు పాలిస్తే మరో పార్టీ తరువాత అయిదేళ్ళకూ అధికారాన్ని అందుకుంటోంది. ఇది విభజన ఏపీలో పొలిటికల్ హిస్టరీగా ఉంది. 2014లో చూస్తే టీడీపీ గెలిచి అధికారం చేపట్టింది. 2019 నాటికి చూస్తే వైసీపీ గెలిచింది. బంపర్ మెజారిటీ కూడా సాధించింది. 2024 తిరిగేసరికి మళ్ళీ టీడీపీ కూటమి పవర్ ని సొంతం చేసుకుంది. ఇలా చూస్తే కనుక ప్రతీ ఎన్నికకూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అన్నది ఒక రాజకీయ విశ్లేషణ. అయితే ఈసారి ఆ చాన్స్ లేనే లేదు అంటున్నారు అర్థ శతాబ్దం రాజకీయాలను చూసిన వారు విశేష అనుభవం గడించిన వారు అయిన ఏపీ సీఎం చంద్రబాబు.

నిజమైన విశ్లేషణతో :

చంద్రబాబు నాలుగవ సారి ఏపీకి సీఎం అయ్యారు. ఆయన అంతకు ముందు ఉమ్మడి ఏపీలో రెండు సార్లు సీఎంగా చేశారు. విభజన ఏపీలో మరో రెండు సార్లు అయ్యారు. గతంలో చూస్తే ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ బలంగా ఉండేది, ఎంతో మంది దిగ్గజ నేతలు ఉండేవారు. అందులో వారిలో వారికే పోటీగా ఉండేది. దాంతో టీడీపీకి అది ఒక ఈజీ టాస్క్ గానూ మారింది. అలా 1999 ఎన్నికల్లో టీడీపీ బాబు నాయకత్వంలో రెండోసారి గెలిచింది. అయితే 2004 కి వచ్చేసరికి మాత్రం సీన్ మారింది దానికి కారణం కాంగ్రెస్ ని ఏకత్రాటిపైకి తీసుకుని వచ్చి వైఎస్సార్ బాబుకు బలమైన ప్రత్యర్థిగా మారారు.

కొంత లైట్ తీసుకున్నారు :

ఇది రాజకీయంగా ప్రధానమైతే బాబు చేపట్టిన పాలనాపరమైన సంస్కరణలు అంతే కాకుండా ఆయన పూర్తిగా డెవలప్మెంట్ మీద ఫోకస్ పెట్టి పార్టీ మీద దృష్టి కొంత తగ్గించడం అని చెబుతారు. మొత్తానికి ఆ విధంగా ఓటమి జరిగింది. 2009లో అయితే టీడీపీ కచ్చితంగా గెలిచేదే కానీ మూడవ పార్టీ వచ్చి అవకాశాలు దెబ్బ తీసింది అన్న విశ్లేషణలు ఉన్నాయి. 2014 నాటికి బాబు అనుభవం అన్న నినాదంతో ఏపీలో అధికారంలోకి వచ్చారు. కానీ ఆయన అమరావతి రాజధాని మీదనే దృష్టి పెట్టడంతో పాటు పార్టీని కొంత నిర్లక్ష్యం చేయడం వల్ల కూడా ఇబ్బందులు వచ్చాయి. పైగా వైసీపీని కొంత లైట్ తీసుకున్నారు అని అంటారు.

ఫుల్ ఫోకస్ తో :

అన్నీ పూర్తిగా అవగాహన చేసుకున్న బాబు 2024 ఎన్నికల తరువాత మాత్రం వైసీపీకి ఏ మాత్రం చాన్స్ ఇవ్వకుండానే ముందుకు సాగుతున్నారు. ఆయన అటు పాలన, ఇటు పార్టీ రెండూ చూస్తున్నారు. అంతే కాదు అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండూ కూడా బాలెన్స్ చేస్తున్నారు. కూటమి అనుకూల ఓట్లను కన్సాలిడేటెడ్ చేసుకోగలిగారు. చీలికలు లేకుండా కూటమి కట్టారు. అది బలంగా ఉంది. మరో వైపు చూస్తే వైసీపీ ఓటమి తరువాత మరింత ఇబ్బందులు పడుతోంది. జగన్ అయితే పెద్దగా జనాల్లోకి రావడం లేదు, విపక్షంలో వైసీపీ ఒంటరిగా ఉంది. దాంతో పాటు కూటమి సాలిడ్ గా దాదాపుగా 60 శాతం ఓటు షేర్ ని 2024లో రాబట్టింది. ఇందులో ఏ మాత్రం కొంత తగ్గినా కూడా 2029 లో తిరిగి గెలిచేందుకు నూరు పాళ్ళూ అవకాశాలు ఉంటాయని బాబు అంచనా వేస్తున్నారు.

మొత్తం నట్లు అన్నీ :

అంతే కాదు ఈ నేపథ్యంలో కూడా వైసీపీని ఎక్కడా కూడా ఆయన లైట్ తీసుకోవడం లేదు, ఆ పార్టీని పక్కన పెట్టాలనే చెబుతున్నారు ప్రజలకు కూడా వైకుంఠపాళీ ఆట ఆడవద్దు అని చెబుతున్నారు. ఒకే పార్టీ పదికాలాలు అధికారంలో ఉంటే కనుక కచ్చితంగా అభివృద్ధి సాగుతుందని అంటున్నారు. ఇక రాజకీయంగా చూస్తే వైసీపీని సంస్థాగతంగా మునుపటి తీరులో ఉన్న బలం ఉందా అన్నది కూడా కూటమిలో చర్చగా ఉంది. జగన్ పాలనను జనాలు ఒకసారి చూసారు కాబట్టి 2019 నాటి పరిస్థితులు మళ్ళీ లేకపోవచ్చు అన్నది కూడా ఉంది అంటున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బాబు మొత్తం నట్లు అన్నీ బిగించేస్తున్నారు. తనదైన రాజకీయ మంత్రాంగంతో ముందుకు సాగుతున్నారు. అటూ ఇటూ మొత్తం ఏపీ రాజకీయ చదరంగం అంతా బాబే ఆడుతున్న ఈ నేపథ్యంలో వైసీపీ దీనిని ఏ విధంగా చేదిస్తుంది అన్నదే అతి పెద్ద చర్చగా ఉంది.

# కవిత వెనుక రేవంత్ రెడ్డి ఉన్నాడా?





హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత వ్యవహారాలను ప్రస్తావిస్తూ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

కేటీఆర్ సోదరి కవితపై రేవంత్ సానుభూతి

రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కవిత కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా ఆమె తన ఇంటి నుంచి వెలివేయబడ్డారని ఆరోపించారు. ఈ ఘటనతో కవిత కన్నీరు పెట్టుకున్నారని ఆయన పేర్కొన్నారు. “తన సొంత చెల్లిని కాపాడలేని వ్యక్తి, ప్రజల సమస్యల కోసం ఏం చేస్తాడు? కవిత వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలకు స్పందించు ముందు, కేటీఆర్ ప్రజల సమస్యలపై మాట్లాడటానికి న్యాయం ఉందా?” అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

బీఆర్ఎస్–బీజేపీ ‘రహస్య ఒప్పందం’పై మరోసారి గుస్సా

ఇదే సందర్భంలో రేవంత్ రెడ్డి మరోసారి బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ‘రహస్య ఒప్పందం’ను ప్రస్తావించారు. కవితకు ఆమెకు దక్కాల్సిన ఆస్తి వాటా ఇవ్వకుండా కుట్ర పన్నారని, ఈ రెండు పార్టీలు పరస్పర ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

కవిత పరోక్ష విమర్శలు: కుటుంబ కలహాలు బహిరంగం?

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ఇటీవల కవిత కూడా తన సోదరుడు కేటీఆర్‌పై పరోక్షంగా విమర్శలు చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. “తన బావ ఫోన్‌ను ఎవరు ట్యాప్ చేస్తారు?” అని ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబంలో నెలకొన్న అంతర్గత ఉద్రిక్తతలను బయటపెట్టాయని భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు కుటుంబంలో నెలకొన్న సమస్యలను.. విభేదాలను స్పష్టం చేస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

జూబ్లీహిల్స్ ప్రజలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. తమ పాలనలో అభివృద్ధి , పారదర్శకతకు పెద్ద పీట వేస్తామని, ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కేటీఆర్–కవిత మధ్య ఉన్న సంబంధాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శిబిరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# వైసీపీ మీద కాంగ్రెస్ వ్యూహాత్మక మౌనం




అమరావతి,ఏపీ రాజకీయాల్లో అంతా ఒక్క విషయం గమనిస్తున్నారో లేదో కానీ కాంగ్రెస్ నుంచి విమర్శలు అయితే వైసీపీ మీద పెద్దగా లేవు. అంతే కాదు కూటమి మీద బిగ్ సౌండ్ చేస్తున్నారు. ఇక ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అయిన వైఎస్ షర్మిల అయితే జగన్ ఊసే దాదాపుగా మరచారు అని అంటున్నారు. ఆమె ఈ మధ్య చాలా తక్కువగానే మీడియాతో ఇంటరాక్ట్ అవుతున్నారు. ట్వీట్లు కూడా కొంత తగ్గాయి. ఇక ఆమె చేసే ప్రతీ విమర్శ కూడా అధికార కూటమి మీదనే ఉంది. ఇదంతా దేనికి దీని వెనక ఏముంది, అసలు కాంగ్రెస్ ఆలోచనలు ఏ దిశగా సాగుతున్నాయి అన్నది అయితే చర్చగానే ఉంది.

పిక్చర్ అయితే క్లియర్ :

జాతీయ రాజకీయాల్లో ఎన్డీయే కూటమి ఉంది. ఏపీలో చూస్తే టీడీపీ జనసేన రెండూ ఎన్ డీయేతోనే ఉంటాయన్నది క్లియర్ అయింది. 2029 ఎన్నికల్లో కూడా అంతా కలసి పోటీ చేస్తాయని పై స్థాయిలో ఇప్పటి నుంచే నిర్ణయం తీసుకోవడమే కాదు దానిని గ్రౌండ్ లెవెల్ లో క్యాడర్ కి కూడా పంపిస్తున్నారు అని అంటున్నారు. దీని వల్ల క్యాడర్ గందరగోళం కాకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఏపీలో రాజకీయమే దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది.

కాంగ్రెస్ స్ట్రాటజీ :

మరో వైపు చూస్తే కాంగ్రెస్ కూడా సౌత్ వైపు చూస్తోంది. తెలంగాణలో ఎటూ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏపీలో అంత సత్తా లేనప్పటికీ పొత్తుల కోసం అయితే కాంగ్రెస్ చూస్తోంది. టీడీపీ జనసేనలతో బీజేపీకి పొత్తు ఉంది. మరో వైపు కమ్యూనిస్టులు ఏపీలో ఉన్నారు, వారు కాంగ్రెస్ తో జాతీయ స్థాయిలో ప్రయాణిస్తున్నారు 2029 నాటికి ఏపీలో కూడా ఇండియా కూటమి బలంగా నిర్మించాలని కాంగ్రెస్ పెద్దల ఆలోచనలు సాగుతున్నాయని అంటున్నారు. ఇక ఏపీలో కాంగ్రెస్ క్యాడర్ ఓటు బ్యాంక్ అంతా వైసీపీకి షిఫ్ట్ అయిపోయింది. జగన్ ఓడినా కూడా 40 శాతం ఓటు బ్యాంక్ ఉంది. అంతే కాదు జగన్ ఎక్కడికి వెళ్ళినా ఆయనకు జనాదరణ అన్నది కనిపిస్తోంది. దాంతో ఏపీలో వైసీపీ ఇక కీలకమైన రాజకీయ శక్తిగా ఉంది.

బీహార్ తరువాతనే :

బీహార్ మీద కాంగ్రెస్ కి ఎన్నో ఆశలు ఉన్నాయి. ఈసారి అక్కడ మహా ఘట్ బంధన్ కూటమి గెలిచి తీరుతుందని కాంగ్రెస్ పెద్ద ఎత్తున నమ్మకాలు పెట్టుకుంది. అంతే కాదు ఒక్క బీహార్ ఫలితంతో జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు పుడతాయని కూడా లెక్క వేస్తోంది. ఇక దేశంలో అందునా హిందీ బెల్ట్ లో ఒక పెద్ద రాష్ట్రంలో కనుక గెలిస్తే తప్పకుండా ఆ ప్రభావంతో జాతీయ రాజకీయాల్లో ఎన్నో మార్పులు వస్తాయని అలాగే ఇండియా కూటమిలోకి అనేక పార్టీలు వస్తాయని కూడా భావిస్తోంది. ఇక ఏపీలో చూస్తే కచ్చితంగా కదలిక వస్తుందని భావిస్తున్నారు అని అంటున్నారు.

2029 ఎన్నికలు అగ్ని పరీక్ష :

వైసీపీ విషయంలో . అందుకే వ్యూహాత్మకమైన మౌనాన్ని పాటిస్తున్నారు అని అంటున్నారు. ఇక వైసీపీ వైపు నుంచి చూస్తే 2029 ఎన్నికలు అగ్ని పరీక్ష లాంటివి. ఈ ఎన్నికలు చావో రేవోలా ఉండబోతున్నాయి. అందుకే 2024 మాదిరిగా కాకుండా అందివచ్చిన అన్ని అవకాశాలు వైసీపీ కూడా వాడుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజకీయాల్లో కాదేదీ అనర్హం అన్నట్లుగా ఉంటుంది. సో కాంగ్రెస్ వ్యూహాలు వైసీపీ అనివార్యతలు ఏపీ రాజకీయ పరిస్థితులు జాతీయ స్థాయిలో కనుక భారీ మార్పులు వస్తే తప్పకుండా ఏదో ఒక విధమైన ఒడ్డుకు పాలిటిక్స్ ని చేర్చే చాన్స్ అయితే ఉంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో.

# ఢిల్లీని వీడిపోవడమే బెటరా ?

ఢిల్లీ, దేశ రాజధాని. 140 కోట్ల మందికి పైగా ప్రజానీకాన్ని పాలించే ఒక ప్రభుత్వానికి కీలక స్థానం. ముఖ్య పట్టణం. ఢిల్లీ అన్నది రాజకీయ అధికార కేంద్రం కూడా. అక్కడ నుంచే ఎన్నో శాసనాలు అమలు అవుతాయి. అక్కడ నుంచే బలమైన ప్రభుత్వం దేశాన్ని పాలిస్తుంది. అందుకే ఢిల్లీ అంటే రాజు లాంటిదే. ఢిలీలో అధికార వ్యవస్థ రాజకీయ వ్యవస్థతో పాటు అంతా ఉంటుంది. ఇక కోట్లాది మంది జనాలు ఉంటారు. ఢిల్లీకి ఫ్లోటింగ్ పాపులేషన్ కూడా చాలా ఎక్కువ. అలాంటి ఢిల్లీలో నివాసం ఉండడం అన్నది ఒకపుడు హోదా. ఒక గౌరవం. ఇపుడు చూస్తే వాటిని మించిన ఇబ్బందులు కూడా ఉన్నాయని అంటున్నారు.

కాలుష్యం కోరలలో :

ఎంత గొప్ప నగరం అయినా ఎంత ధీటైన మెగా సిటీ అయినా ఢిల్లీని వణికిస్తోంది కాలుష్యం. ఈ భూతం ప్రతీ ఏటా పంజా విసురుస్తోంది. అది ఏ ఏటికి ఆ ఏడు మరింతగా పెరుగుతోంది. దాంతో ఢిల్లీలో నివసించే వారిని ఇబ్బందులు పెడుతోంది. అనారోగ్యం సమస్యలతో పట్టి పీడించేలా చేస్తోంది. దాంతో శీతాకాలం వచ్చిందంటే చాలు ఢిల్లీ గడగడ లాడుతుంది. వాయు కాలుష్యం తాలూకా నాణ్యతా ప్రమాణాలు చాలా దారుణంగా పడిపోతాయి. దీనిని ఇంగ్లీష్ లో ఏక్యూఐ అంటారు. ఇది ఢిల్లీలో చాలా ప్రాంతాలలో ఏకంగా 400 పైదాటిపోతోంది. ఇది ప్రమాదానికి సంకేతాలుగా చెబుతున్నారు.

వీడితేనే సుఖం :

ఇక రానున్న మూడు నెలలు మరింత చలి వాతావరణం ఢిల్లీని కమ్మేస్తుంది. దానితో పాటుగా కాలుష్యం కూడా ఢిల్లీలో ఇంకా ప్రబలుతున్నది. అందుకే ఢిల్లీలో ఉన్న వారు ఈ కీలక సమయంలో వేరే చోటకు వెళ్తేనే మేలు అని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎయిమ్స్ మాజీ పల్మోనాలజిస్ట్ గోపీచంద్ ఖిల్నాని అయితే ఢిల్లీ వాసులకు ఒక మేలైన సూచన కూడా చేస్తున్నారు. ఎవరికి వీలైతే వారు తక్కువలో తక్కువ రెండు నెలల పాటు ఢిల్లీని దాటి ఎక్కడికైనా వెళ్ళిపోండి. దాని వల్ల మీ ఆరోగ్యం బాగుంటుంది, మీరూ బాగుంటారు అని సలహా ఇస్తున్నారు.

ఇదే ఉత్తమ మార్గం :

కాలుష్యం నుంచి తప్పించుకోవాలీ అంటే ఇంతకు మించిన ఉత్తమ మార్గం వేరేది లేదని ఆయన అంటున్నారు. అయితే అందరూ వెళ్ళలేకపోయినా పర్లేదు కానీ అనారోగ్య సమస్యలతో చాలా కాలంగా ఇబ్బంది పడుతున్న వారు ఊపిరి తిత్తుల వ్యాధులతో అవస్థలు పడుతున్న వారు ఇతరమైన ఆరోగ్య సమస్యలు



ఇబ్బందులు ఉన్న వారు అయితే తక్షణం ఢిల్లీని వీడిపోతేనే చాలా మంచిది అని అంటున్నారు. దీని వల్ల వారు హాయిగా ఉండగలుగుతారు అని ఆయన ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు సూచనలు చేశారు.

ఆక్సిజన్ పీల్చుకోవడం కష్టం :

అంతకంతకు వాయు కాలుష్యం ప్రబలిపోతున్న ఈ దశలో ఆక్సిజన్ ని కూడా పీల్చుకోవడం చాలా కష్టంగా మారుతుందని ఆయన అంటున్నారు. గుండె జబ్బుల వారికి ఈ పరిస్థితులు ఏ మాత్రం క్షేమకరం కాదని అంటున్నారు. వీరంతా తక్కువ కాలుష్యం ఉన్న చోటకు వెళ్తే కనుక వారు బాగుంటారు అని అదే సరైన ఊరటగా వారికి ఉంటుందని అంటున్నారు.

కొంప ముంచుతున్న తీరు :

వాయు కాలుష్యం కొంప ముంచుతోంది అని అంటున్నారు. గతంలో బాగా పొగాకు లేదా ధూమపానం అలవాటు ఉన్న వారికి మాత్రమే వచ్చే క్రోనిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ ఇపుడు వాయు కాలుష్యం పుణ్యమాని నూటికి యాభై మంది దాకా వస్తోంది అని ఆయన చెబుతున్నారు. పెద్ద చిన్నా తేడా లేకుండా లంగ్ క్యాన్సర్ కూడా దీని వల్ల వస్తోంది అని అంటున్నారు. అంతే కాకుండా హృదయ సంబంధిత వ్యాధులు మెదడు మూత్ర పిండాల వ్యాధులతో పాటు పేగులు జీర్ణ వ్యవ్థ కూడా ఈ వాయు కాలుష్యం వల్ల దెబ్బ తింటోందని ఆయన హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ ప్రజలకు శీతాకాలం వచ్చింది అంటే మంచి గాలి అన్నది కరవు అవుతోంది. దాంతో ఫిబ్రవరి నెల దాకా ఇదే రకమైన పరిస్థితి ఉంటోంది. దానిని అధిగమించేందుకు కొన్నాళ్ళ పాటు ఢిల్లీని వీడిపోవడమే బెటరా అంటే అదే మంచిది అన్నది ఆరోగ్య నిపుణుల సూచనగా ఉంది.

# ఎంతసేపూ నెహ్రూ...ఇందిరా గురించేనా...పాయింటే మరి !



న్యూఢిల్లీ,ఈ దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒక్కతే స్వాతంత్ర్యం తెచ్చింది అన్నది పూర్తి నిజం కాకపోయినా చాలా వరకూ నిజం అందులో ఉంది. కాంగ్రెస్ అనే సంస్థ అనాడు తెల్ల దొరలతో పోరాడి సాధించింది. ఇక మిగిలిన సంస్థలు కూడా పోరాటం చేసాయి. అంతా కలసి దేశానికి స్వేచ్ఛా వాయువులు ప్రసాదించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూ ఒక పదిహేడేళ్ళు, ఇందిరాగాంధీ ఒక పదహారేళ్ళు ఈ దేశాన్ని ఏలారు. ఇక రాజీవ్ గాంధీ అయిదేళ్ళ పాలన కూడా కలుపుకుంటే 38 ఏళ్ళ పాటు ఒకే కుటుంబం ఏలుబడిలో దేశం ఉంది. నెహ్రూ ఫ్యామిలీ పాలించడం వల్ల దేశానికి మేలు జరిగిందా లేదా అంటే ఇక్కడ కూడా భిన్న వాదనలు ఉన్నాయి. అయితే మంచీ జరిగింది, కొన్ని సందర్భాలలో ఇబ్బందులు కూడా వచ్చాయి. కానీ విమర్శలు చేసే వారు ప్రధానంగా ప్రత్యర్థులు అయితే నెహ్రూ ఫ్యామిలీని లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున ఎటాక్ చేస్తూంటారు. మరీ ముఖ్యంగా చూస్తే బీజేపీ ఈ పని చేస్తూ వస్తోంది దీని మీద ఐదవ తరం గాంధీలు గట్టిగా బదులిస్తున్నా బీజేపీ బిగ్ సౌండ్ లో అది పెద్దగా వినిపించడం లేదు అన్న మాట కూడా ఉంది.

ప్రియాంక ఫైర్ :

బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ ఆ పార్టీ అగ్ర నేత అయిన ప్రియాంకా గాంధీ బీజేపీ అగ్ర నేతల మీద ఒక రేంజిలో ఫైర్ అయ్యారు. ఎంతసేపూ నెహ్రూ ఇందిరాగాంధీలను విమర్శించడం తప్పించి బీజేపీ ఈ దేశానికి ఏమి చేసిందని ఆమె సూటిగా ప్రశ్నించారు. మాట్లాడితే చాలు నెహ్రూ అలా చేసారు, ఇందిర ఇలా చేశారు వారి వల్లనే తప్పులు జరిగాయని నిందలు వేస్తున్న బీజేపీ పెద్దలు తమ హయాంలో ఏమి చేశామో ఎందుకు చెప్పలేకపోతున్నారు అని ఆమె నిలదీశారు. నెహ్రూ ఇందిరాగాంధీ దేశానికి చేసిన మేలు బీజేపీ పెద్దలకు ఏ మాత్రం కనిపించడం లేదని కేవలం రాజకీయ విమర్శలు మాత్రం చేస్తున్నారు అని ఆమె మండిపడ్డారు.

పరిశ్రమలు స్థాపించారు :

ఈ దేశంలో పారిశ్రామిక విప్లవం తీసుకుని వచ్చి పెద్ద ఎత్తున కర్మాగారాలు స్థాపించి ప్రజలకు ఉపాధి కల్పించింది నెహ్రూ ఇందిరాగాంధీలు కాదా అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ రంగంలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయి అంటే దానికి ఆ ఇద్దరి పాలనలో తీసుకున్న కీలక నిర్ణయాలు కారణం కాదా అని ఆమె నిగ్గదీస్తున్నారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి దేశంలో ఉద్యోగ వ్యవస్థని పటిష్టం చేసిన ఆ ఇద్దరు అగ్ర నేతలని విమర్శించే ముందు బీజేపీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు బీజేపీ ఎన్ని ఏర్పాటు చేసిందని ఆమె నిలదీశారు.

వర్తమానమేదీ :

బీజేపీ నాయకులు మాట్లాడితే గతం అంటూ చరిత్రలోకి వెళ్తారని లేదా భవిష్యత్తు ఆశలు చూపిస్తారని తప్పించి వర్తమానంలో వారు ఏమి చేశారు అన్నది ఎపుడూ చెప్పింది లేదని ప్రియాంకా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం బీహార్ లో ఎన్నో ఏళ్ళుగా అధికారంలో ఉండి ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని ఇపుడు మాత్రం ఎన్నికల హామీగా కోటి ఉద్యోగాలు అని ప్రకటిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వలసలకు వెళ్తున్న వారిలో బీహార్ వారే అత్యధికమని ఆమె అన్నారు. ఇలా బీహార్ ని ఏమీ కాకుండా చేసి మరోసారి గెలిపించమని ఎలా అడుగుతారని ఆమె ప్రశన వర్షమే కురిపిస్తున్నారు. మొత్తం మీద చూస్తే నెహ్రూకి ముత్త మనవరాలు, ఇందిరమ్మకు అసలు మనవరాలు అయిన ప్రియాంక సూటిగా సుత్తి లేకుండా బీజేపీ పెద్దలకు వేసిన ప్రశ్నలు ఆలోచింపచేసేలాగానే ఉన్నాయని అంటున్నారు. మరి దీని మీద కమలదళం ఎలా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంది.

## కాంగ్రెస్ అభయహస్తం కాదు...భస్మాసుర హస్తం

హైదరాబాద్,అభయ హస్తం మేనిఫెస్టోలో ప్రజా దర్బార్ ను నిర్వహిస్తాం అన్నారు.. ప్రజా దర్బార్ నిర్వహించడానికే కాంగ్రెస్ కు చేతకాలేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ అవినీతి రూ. లక్ష కోట్లు కక్కిస్తాం అన్నారు.. ప్రజలకు పంచుతాం అన్నారు.. ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించిన మొత్తం డబ్బు ఎంతో..? ముఖ్యమంత్రి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 111 వెనక లక్షల కోట్ల కుంభకోణం అన్నారు.. అది ఏమైందో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ 30 శాతం కమిషన్ సర్కార్ అన్నారు. ప్రస్తుతం ఎంత కమిషన్ నడుస్తుంది ముఖ్యమంత్రి చెప్పాలి అని నిలదీశారు.

# నేషనల్ హైవేలపై యాక్సిడెంట్లు.. కేంద్రం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ,దేశంలో ప్రతిరోజూ రోడ్లపై వందలాది యాక్సిడెంట్లు జరుగుతుంటాయి. ముఖ్యంగా రాష్ట్ర రోడ్ల కంటే నేషనల్ హైవేలపైనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రమాదాలకు చెక్ పెట్టే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారులపై నిర్దిష్ట ప్రాంతంలో ఏడాదికి ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్లకు భారీ జరిమానా విధించనుంది. బిల్డ్ –ఆపరేట్– ట్రాన్స్ఫర్ విధానంలో నిర్మించే రోడ్లకు దీన్ని వర్తింపజేయనున్నట్లు తెలుస్తోంది. ఇకనుంచి బీవోటీ విధానంలో నిర్మించే జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా కాంట్రాక్టర్లే బాధ్యత వహించాలని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. హైవేలపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండే ప్రాంతాల్లో 500 మీటర్ల పరిధిలో సంవత్సరానికి ఒకటి కన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్కు రూ.25 లక్షల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. అంతేకాదు తర్వాతి ఏడాది అదే చోట మళ్లీ ప్రమాదం జరిగితే ఈ ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని హెచ్చరించారు. మరోవైపు రహదారుల మంత్రిత్వశాఖ పరిధిలో ప్రమాద ముప్పు ఉన్న ప్రాంతాలు 3500 వరకు ఉన్నాయని అధికారులు తెలిపారు.

## కూటమి సర్కార్ శుభవార్త..

అమరావతి,ఏపీలో ధాన్యం రైతులకు కూటమి సర్కార్ శుభవార్త తెలిపింది. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఈ మేరకు మంత్రి నాదెండ్ల శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు ధాన్యం వివరాల నమోదుకు 7337359375 వాట్సాప్ నంబర్‌ని వినియోగించుకోవాలని సూచించారు మంత్రి నాదెండ్ల మనోహర్. రైతులు ఈ వాట్సాప్ నంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. 2025 నుంచి 2026 వరకు ఖరీఫ్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీవ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com